http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

మంగళవారం 26 మే 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## ప్రభుత్వం పౌరుల జేబులను నిశ్శబ్దంగా దోచుకుంటోంది

- ద్రవ్యోల్బణ మనిషి మోదీ: రాహుల్ ఫైర్
- ఇంధన ధరల పెంపుపై మండిపడిన కాంగ్రెస్
- ప్రభుత్వం పౌరుల జేబులను నిశ్శబ్దంగా దోచుకుంటోందన్న రాహుల్
- ఎక్స్‌లో పోస్టులు చేసిన కాంగ్రెస్ నాయకులు



## నీట్ గుణపాఠాలు నేర్చుకోవడం లేదు

- నీట్ పేపర్ లీక్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- నీట్–యూజీ 2026 పేపర్ లీక్ కేసుపై సుప్రీంకోర్టులో విచారణ
- కేంద్రం, ఎన్టీఏ, సీబీఐలకు నోటీసులు జారీ
- 2024 మార్గదర్శకాల అమలుపై అఫిడవిట్ ఇవ్వాలని ఆదేశం
- మళ్లీ పరీక్ష నిర్వహణపై పిటిషనర్ల డిమాండ్





## పద్మ పురస్కారాల ప్రదానం

- ధర్మేంద్ర తరపున పద్మ విభూషణ్ అందుకున్న హేమమాలిని
- క్రీడల విభాగంలో పద్మ శ్రీ పురస్కారాన్ని అందుకున్న భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్
- దివంగత ధర్మేంద్రకు పద్మ విభూషణ్



## నైరుతి రుతుపవనాల ఆగమనం
# మరింత ఆలస్యం

- హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం
- రాష్ట్రంలో మాన్‌సూన్ సీజన్‌పై ఎల్‌నినో ఎఫెక్ట్
- జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్‌లో కనిపించనున్న ప్రభావం
- తెలంగాణలో లోటు వర్షపాతం నమోదయ్యే సూచన
- తొలుత కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా

హైదరాబాద్

రాష్ట్రానికి నైరుతి రుతుపవనాల ఆగమనం మరింత ఆలస్యం కానుంది. రుతుపవనాలు తొలుత ఈనెల 26న కేరళ తీరాన్ని తాకుతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే నాలుగైదు రోజులు ఆలస్యంగా తీరాన్ని తాకే అవకాశం ఉందని తాజాగా తెలిపింది. తెలంగాణలోకి జూన్ 5 నుంచి 10 తేదీల్లో నైరుతి ప్రవేశించే అవకాశం - మిగతా3లో

## మహిళల అభివృద్ధితోనే
# రాష్ట్రాభివృద్ధి



- మహిళా శక్తి సూపర్ బజార్‌లు ఏర్పాటు
- రాష్ట్రవ్యాప్తంగా 8వేల మహిళ సంఘాల భవనాల శంకుస్థాపన కార్యక్రమం
- సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- నాణ్యమైన ఉత్పత్తులకు వాటిని చిరునామాగా మార్చండని పిలుపు
- మహిళలను బస్సులకు యజమానులు చేశాం
- అంబానీ, అదానీ చేసే పెట్రోల్ వ్యాపారం మహిళలు కూడా చేయాలనే బంక్‌లు పెట్టించాం

హైదరాబాద్

తెలంగాణలో మహిళా శక్తి సూపర్ బజార్‌లు ఏర్పాటు చేస్తామని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం మహిళా వారోత్సవాలు ప్రారం భించింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 8 వేల ఇందిరా మహిళా శక్తి భవనా లకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు సచివాలయంలో జరిగిన కార్య క్రమంలో మహిళాశక్తి భవనాలకు ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అన్ని కలెక్టరేట్‌లలో మహిళా సంఘాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి నిర్వహించారు. నాణ్యమైన ఉత్పత్తులకు వాటిని చిరునామాగా మార్చండని పిలుపునిచ్చారు. ఆడబిడ్డల ఆశీర్వా దంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్న రేవంత్ రెడ్డి - మిగతా3లో



## రైతులకు తమిళనాడు సీఎం విజయ్ గుడ్‌న్యూస్..

- సహకార బ్యాంకులో వ్యవసాయ రుణాలు రద్దు
- ఈ పథకం వర్తించని ధనిక రైతులకు కూడా రూ.5,000 సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయం
- ది కూడా సహకార బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారికే..

## వారి రేషన్ కార్డు
# రద్దు

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

- రేషన్ కార్డుల అనర్హులను గుర్తిస్తోంది
- అర్హత లేకపోయినా తప్పుడు వివరాలతో పొందినవారిని గుర్తించి కార్డు రద్దు
- వీరిలో సాఫ్ట్ వేర్ ఉద్యోగులే ఎక్కువమంది
- అలాగే రూ.6 లక్షల కంటే ఎక్కువ వార్షిక ఆదాయం ఉన్న వారివి కూడా రద్దు

హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం షాకింగ్ నిర్ణయం తీసుకుంది. అనర్హులైనవారిని గుర్తించి రేషన్ కార్డు రద్దు చేస్తోంది. గత కొంతకాలంగా రేషన్ కార్డుల ఏరివేత కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోంది. అందులో భాగంగా కొంతమంది ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లింపుదారులు, అధిక జీతం పొందే సాఫ్ట్ వేర్ ఉద్యోగులు కూడా రేషన్ కార్డులను పొందినట్లు అధికారుల పరిశీలనలో తేలింది. దీంతో వారి కార్డులను పౌరసరఫరాలశాఖ రద్దు చేస్తోంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి విచారిస్తున్నారు. అనంతరం అనర్హులుగా తేలితే రద్దు చేస్తున్నారు. పరిమితికి మంచి భూమి ఉండటం, రూ. 6 లక్షల కంటే ఎక్కువ వార్షిక ఆదాయం - మిగతా3లో





## విద్యార్థుల ప్రయోజనాలు, వారి ఆరోగ్యమే అన్నింటికంటే ముఖ్యం

- నీట్ పరీక్షపై అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లేఖ..!
- అభ్యర్థుల సౌకర్యార్థం సురక్షితమైన తాగునీరు, కూర్చునేందుకు తగిన ఏర్పాట్లు చేయాలి
- పరీక్ష నిర్వహించే రోజున అంటే జూన్ 21న అభ్యర్థుల కోసం తగిన రవాణా సదుపాయాలు కూడా అందుబాటులో ఉండేలా..

## ఇందిరమ్మ ఇళ్లపై
# పిడుగు

- నిర్మాణ సామగ్రిపై లబ్ధిదారులకు అధిక భారం
- ఇందిరమ్మ ఇళ్లకు ఆటంకం
- ఇందిరమ్మ లబ్ధిదారులపై నిర్మాణ సామగ్రి భారం
- తక్కువ ధరకే సరఫరా చేస్తామన్న మాట క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు



హైదరాబాద్

పేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం అమలులో మొదటి నుంచి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. నిర్మాణ సామగ్రి ధరలు పెరుగుదల ఇందిరమ్మ ఇళ్ల పురోగతికి ఆటంకం కలిగిస్తోంది. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, స్టీల్, ఇతర సామగ్రి ధరల పెరుగుదల లబ్ధిదారులపై అదనపు భారాన్ని మోపుతోంది. గత కొద్ది రోజులుగా ఇంధన ధరలు పెరగడం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసింది. ఇంటికి సంబంధించి ఇసుక, సిమెంట్‌ను తక్కువ ధరకే సరఫరా చేస్తామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. - మిగతా3లో



## యూపీ అసెంబ్లీ, సెక్రటేరియట్‌పై దాడికి ఉగ్రవాదుల కుట్ర

- 'ఎర్రకోట' పేలుడు కేసు దర్యాప్తులో షాకింగ్ నిజాలు
- లఖ్‌నవూలో వరుస పేలుళ్లకు ఉగ్రవాదుల స్కెచ్
- రెక్కీ నిర్వహించిన ముష్కర డాక్టర్ల ముఠా
- ఎన్ఐఏ దర్యాప్తులో వెలుగు చూసిన నిజాలు

# యూపీ అసెంబ్లీ, సెక్రటేరియట్‌పై దాడికి ఉగ్రవాదుల కుట్ర



దిల్లీలోని ఎర్రకోట బాంబు పేలుడు కేసుపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చేసిన దర్యాప్తులో భయంకరమైన ఉగ్రకుట్ర వెలుగులోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీతో పాటు, జనాలు ఎక్కువగా తిరిగే పలు ప్రముఖ ప్రాంతాల్లో వరుస ఉగ్రదాడులు జరపడానికి నిందితులు ప్లాన్ చేసినట్లు అధికారిక వర్గాలు సోమవారం తెలిపాయి. "ఈ ఉగ్రకుట్రలో భాగంగానే ఎర్రకోట పేలుడు నిందితులైన డాక్టర్ ముజమ్మిల్ షకీల్, డాక్టర్ షాహీన్ సయూద్‌లు హరియాణాలోని ఫరీదాబాద్ నుంచి లఖ్‌నవూకు వెళ్లారు. ముందే వేసుకున్న ప్లాన్ ప్రకారం 2025 ఆగస్టు 25 నుంచి 30 మధ్య వీరు లఖ్‌నవూలో రెక్కీ నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లోని కీలక భవనాలపై దాడులకు ప్లాన్ చేశారు. అందులో భాగంగా యూపీ అసెంబ్లీ, బాపు భవన్ (సివిల్ సెక్రటేరియట్)తో పాటు జనాలు భారీగా వచ్చే ఇమాంబరా, లాల్‌బాగ్, అమీనాబాద్ ప్రాంతాలపై ముజమ్మిల్ రెక్కీ నిర్వహించాడు. ఈ ప్రాంతాలు తమ ఉగ్రదాడులకు సరిగ్గా సరిపోతాయని నిందితులు భావించారు. ఈ భవన సముదాయాల సమీపంలో పేలుడు పదార్థాలతో నింపిన కారును పేల్చాలని వారు ఒక ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు" అని ఓ ఎన్ఐఏ అధికారి తెలిపారు.

### మదర్ ఆఫ్ సైతాన్

ఎన్ఐఏ దర్యాప్తులో మరో కీలక విషయం కూడా బయటపడింది. లఖ్‌నవూలో 'ట్రైఅసిటోన్ ట్రైపెరాక్సైడ్' (టీఏటీపీ) తయారీకి అవసరమైన రెండు రసాయనాలు (ప్రికర్సర్ కెమికల్స్) దొరికే షాపుల కోసం ముజమ్మిల్ తన ఫోన్‌లో వెతికాడు. 'మదర్ ఆఫ్ సైతాన్' అని పిలిచేఈ టీఏటీపీ రసాయనం అత్యంత ప్రమాదకరమైనది. 2025 నవంబర్ 10వ తేదీన దిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడులో కూడా ఇదే రసాయనాన్ని ఉపయోగించారు. ముజమ్మిల్ ఆదేశాల మేరకు షాహీన్ ఆ రసాయన దుకాణాల పేర్లను తన సొంత చేతిరాతతో ఒక కాగితంపై రాసుకుంది. ఆ తర్వాత దీనిని ఆమె తన ఫోన్‌లో ఫొటో తీసుకుంది. ఆ లిస్టును ఎన్?ఐఏ అధికారులు ఆమె ఫోన్ నుంచే స్వాధీనం చేసుకున్నారు.

### బంధువుల ఇంట్లో ఉగ్రవాదుల బస

లఖ్‌నవూకు రెక్కీ కోసం వచ్చిన ఆ ఇద్దరు ఉగ్రవాదులు లాల్‌బాగ్‌లోని ఖండారీ బజారులో ఉన్న షాహీన్ బంధువల ఇంట్లో బస చేశారు. ఆ తర్వాత లఖ్?నవూకు చెందిన, ఆ నగరంపై పూర్తి అవగాహన ఉన్న ఒక వ్యక్తి(సాక్షి)ని ముజమ్మిల్ సంప్రదించాడు. తాను చెప్పిన రసాయన దుకాణాలకు స్వయంగా వెళ్లి, సదరు కెమికల్స్ భారీ పరిమాణంలో ఉన్నాయో, లేవో కనుక్కోవాలని కోరాడు. ముజమ్మిల్ బయటి వ్యక్తి కావడం వల్ల నేరుగా వెళ్తే అనుమానం వస్తుందని గ్రహించి, ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు స్థానికుడైన ఆ వ్యక్తిని ఈ పని కోసం వాడుకున్నట్లు ఎన్ఐఏ వర్గాలు తెలిపాయి.

### బాంబులు తయారీ కోసం ప్లాన్

అధికారిక వర్గాల ప్రకారం, ఎర్రకోట పేలుడు కోసం ఈ ఉగ్రవాదులు హరియాణా రాష్ట్రంలో, ఫరీదాబాద్?లోని ఖోరి జమాల్?పూర్?లో ఒక అద్దె ఇంట్లో రహస్యంగా ఉంటూ బాంబులు తయారు చేశారు. అదే విధంగా బాంబులు తయారు చేసేందుకు లఖ్?నవూ నగర శివార్లలో కూడా ఒక నిర్జన ప్రదేశాన్ని వారు వెతికారు. అక్కడ గుట్టుచప్పుడు కాకుండా పేలుడు పదార్థాలు తయారు చేయాలని ప్లాన్ చేశారు. ఎన్?ఐఏ పలువురు ప్రత్యక్ష సాక్ష్యులు చెప్పిన వివరాలను సేకరించింది. తమకు దొరికిన ఆధారాలతో సాంకేతిక విశ్లేషణ (టెక్నికల్ అనాలసిస్?) చేసింది. ఉగ్రవాదులకు నిధులు అందే మార్గాలను ట్రేస్ చేసింది. వీటన్నింటినీ లింక్? చేస్తూ ఎన్?ఐఏ జరిపిన సమగ్ర దర్యాప్తులో, టెర్రరిస్టులు లఖ్?నవూలో చేపట్టాలనుకున్న ఉగ్ర దాడుల గురించి తెలిసింది.

### ఉగ్రకుట్ర భగ్నం చేశారిలా!

2025 నవంబర్? 10న దేశరాజధాని దిల్లీలో ఎర్రకోట సమీపంలో కారు బాంబు పేలుడు జరిగింది. ఈ ఉగ్రదాడి గురించి మే 14న ఎన్?ఐఏ 7,500 పేజీల ఛార్జ్?షీట్?ను కోర్టులో దాఖలు చేసింది. అందులో ఈ కేసుకు సంబంధించిన కీలక వివరాలు ఉన్నాయి. 'అల్-?ఖైదా ఇన్? ది ఇండియన్ సబ్?కాంటినెంట్?' (ఏక్యూఐఎస్?) ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్న 'అన్సార్? గజ్వాతుల్ హింద్?' ఉగ్రముఠా ఉత్తరప్రదేశ్ రాజధాని లఖ్?నవూను తమ రహస్య స్థావరంగా మార్చుకోవాలని చూసిందని ఎన్?ఐఏ పేర్కొంది. ఎర్రకోట పేలుడుకు వాడిన బాంబును మళ్లీ అదే సాంతికతతో తయారు చేసి లఖ్?నవూలో వరుస పేలుళ్లు జరపడమే వీరి లక్ష్యమని తెలిపింది. అయితే ఎన్?ఐఏ ఈ ఉగ్రకుట్రను ముందుగానే పసిగట్టడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఉగ్రముఠాలో వైద్యులు ఉండడంతో దీనిని 'డాక్టర్స్ ముఠా' లేదా 'వైట్?కాలర్ టెర్రరిస్టులు' అని పిలుస్తున్నారు. వీరు ముందుగా వైద్య వృత్తిలో ఉండి, ఆ తర్వాత ఏక్యూఐఎస్?, అన్సార్? గజ్వాతుల్ హింద్? తీవ్రవాద సంస్థల భావజాలానికి ఆకర్షితులయ్యారు. అయితే వీరి ఉగ్రకుట్రను ఎన్?ఐఏ భగ్నం చేసింది.

# పద్మ పురస్కారాల ప్రదానం

రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జూ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్రమంత్రులు పాల్గొన్నారు. ఇద్దరు పద్మవిభూషణ్, ఆరుగురు పద్మ భూషణ్, 58 మంది పద్మశ్రీ అవార్డులను రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. బాలీవుడ్‌కు విశేష సేవలందించిన సినీ నటుడు ధర్మేంద్రకు మరణానంతరం పద్మవిభూషణ్ ప్రకటించగా ఆయన భార్య హేమమాలినీ రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ధర్మేంద్ర పేరు ప్రకటించగానే ఆయన కూతురు అహానా డియోల్ భావోద్వేగానికి గురయ్యారు. అంతకుముందు ఈ గౌరవం తమ కుటుంబానికే కాకుండా యావత్ దేశానికి ఆనంద క్షణం అని హేమా మాలిని ఏఎన్ఐతో అన్నారు. "ఇది మమ్మల్ని చాలా సంతోషపరుస్తుంది, యావత్ దేశం సంతోషంగా ఉంది. ఇది ముందే వచ్చి ఉంటే, ధర్మేంద్రజీ చాలా సంతోషించేవారు. ఆయన్ని చూసి అభిమానులు మరింత సంతోషించేవారు." అని ఆమె అన్నారు.

### హర్మన్‌ప్రీత్ కౌర్‌కు పద్మశ్రీ పురస్కారం

కళల విభాగంలో ఎన్. రాజమ్ పద్మ విభూషణ్ పౌర పురస్కారాన్ని అందుకున్నారు. ప్రజావ్యవహారాల విభాగంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారీ, కళల విభాగంలో ఆర్. గణేశ్, వాణిజ్యం-పరిశ్రమలు విభాగంలో ఉదయ్ కోటక్‌లు రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మ భూషణ్ అవార్డును అందుకున్నారు. ప్రజావ్యవహారాల విభాగంలో మరణాంతరం వీకే మల్హోత్రాకు పద్మ భూషణ్ ప్రకటించగా, ఆయన కుమారుడు పురస్కారాన్ని అందుకున్నారు. క్రీడల విభాగంలో భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు.

మెడిసెన్ విభాగంలో తెలంగాణకు చెందిన వైద్యులు గూడూరు వెంకట్ రావు, పాల్కొండ విజయ్ ఆనంద్ రెడ్డి పద్మ అవార్డులు అందుకున్నారు. కళల విభాగంలో దీపికా రెడ్డి పద్మ అవార్డు అందుకోగా సాహిత్యం- విద్య విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వెంపటి కుటుంబ శాస్త్రి పద్మ పురస్కారాన్ని అందుకున్నారు. కళల విభాగంలో మరణానంతరం గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌కు పద్మ అవార్డు ప్రకటించగా ఆయన కుమారుడు పురస్కారాన్ని అందుకున్నారు.





గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 2026 సంవత్సరానికి సంబంధించిన పద్మ పురస్కార గ్రహీతల అధికారిక జాబితాను ప్రకటించింది. ఐదుగురికి పద్మవిభూషణ్, 13 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు ప్రకటించింది. మొత్తం 113 పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించిన కేంద్రం, వారిలో 45 మంది అన్‌సంగ్ హీరోలను ఎంపిక చేసింది. 2026 సంవత్సరానికిగానూ మొత్తం 131 పద్మ పురస్కారాల ప్రదానానికి రాష్ట్రపతి ఆమోదం తెలుపగా, మిగతా అవార్డులను రెండో విడత జరిగే కార్యక్రమంలో అందజేస్తారని అధికార వర్గాలు తెలిపాయి. కళలు, సాహిత్యం, సామాజిక సేవ, వైద్యం, విద్య, ప్రజా సేవ వంటి వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు సమాజానికి అందించిన విశిష్ట సేవలు, అంకితభావం, దీర్ఘకాలిక కృషిని గుర్తించి ఈ ప్రతిష్టాత్మక పౌర పురస్కారాలను అందజేస్తారు.

### పద్మవిభూషణ్?

ధర్మేంద్రకు మరణానంతరం పద్మవిభూషణ్
అచ్యుతానందన్(కేరళ)కు మరణానంతరం పద్మవిభూషణ్
కె.టి.థామస్(కేరళ)కు పద్మవిభూషణ్
సాహితీవేత్త పి.నారాయణన్(కేరళ)కు పద్మవిభూషణ్
కళల విభాగంలో ఎన్.రాజాం(ఉత్తరప్రదేశ్)కు పద్మవిభూషణ్

**పద్మభూషణ్?**

నోరీ దత్తాత్రేయుడు (వైద్యం)- అమెరికా
మమ్ముట్టి (కళలు)- కేరళ
అల్కా యాజ్ఞిక్ (కళలు)- మహారాష్ట్ర
కల్లిపట్టి రామసామి పళనిస్వామి (వైద్యం)- తమిళనాడు
పీయూష్ పాండే (మరణాంతరం) (కళలు)- మహారాష్ట్ర
ఎస్‌కేఎం మెయిలానందన్ (సామాజిక సేవ)- తమిళనాడు
శతావధాని ఆర్ గణేశ్ (కళలు)- కర్ణాటక
శిబూ సోరెన్ (మరణాంతరం) (ప్రజావ్యవహారాలు)- ఝార్ఖండ్
ఉదయ్ కొటక్ (వాణిజ్యం-పరిశ్రమలు)- మహారాష్ట్ర
వీకే మల్హోత్రా (మరణాంతరం) (ప్రజావ్యవహారాలు)- దిల్లీ
వెల్లప్పల్లి నటేశన్ (ప్రజావ్యవహారాలు)- కేరళ
విజయ్ అమృత్‌రాజ్ (క్రీడలు)- అమెరికా
భగత్‌సింగ్ కోశ్యారీ (ప్రజావ్యవహారాలు)- ఉత్తరాఖండ్

## రైతులకు తమిళనాడు సీఎం విజయ్ గుడ్‌న్యూస్..



తమిళనాడు రైతులకు సీఎం విజయ్ శుభవార్త చెప్పారు. సహకార బ్యాంకుల్లో రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. దీని ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా సహకార బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులకు గరిష్టంగా రూ.50,000 వరకు రుణమాఫీ లభిస్తుంది. ఈ పథకం వర్తించని ధనిక రైతులకు కూడా రూ.5,000 సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అది కూడా సహకార బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారికే. విజయ్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా పేద, సన్నకారు రైతులకు అప్పుల నుంచి భారీ ఊరట లభించనుంది. ప్రభుత్వ నిర్ణయం వల్ల తమిళనాడులోని 14.22 లక్షల మంది రైతులకు మేలు జరగనుంది. ఈ రుణ మాఫీ వల్ల ప్రభుత్వానికి రూ.2,044 కోట్ల భారం పడుతుంది. ఇటీవలి కాలంలో సీఎంగా విజయ్ తీసుకున్న కీలక నిర్ణయం ఇది. మరోవైపు కావేరి నదిపై కర్ణాటక ప్రభుత్వం చేపట్టనున్న మేకేడాటు డ్యామ్ ప్రాజెక్ట్ నిర్మాణంపై కూడా అధికారులతో సీఎం విజయ్ చర్చించారు. కర్ణాటక చేపట్టనున్న ఈ ప్రాజెక్టును తమిళనాడు వ్యతిరేకిస్తోంది. దీనివల్ల తమ రాష్ట్రంలోని రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తమిళనాడు ప్రభుత్వం వాదిస్తోంది. కావేరి నదీ జలాల విషయంలో తమిళనాడు, కర్ణాటక మధ్య దశాబ్దాలుగా వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. ఇక, మేకేడాటు డ్యామ్ ప్రాజెక్ట్‌కు ఇటీవలే కర్ణాటక ప్రభుత్వం భూమి పూజ నిర్వహించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా తమ రైతుల హక్కులకు నష్టం జరుగుతుందనేది తమిళనాడు ప్రభుత్వ వాదన. ఈ విషయంలో గతంలో తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను ఇటీవలే సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ అంశం కేంద్ర నిపుణుల పరిధిలోకి వస్తుందని సుప్రీం కోర్టు తెలిపింది. కోర్టు ఆదేశాలను దృష్టిలో పెట్టుకుని తదుపరి న్యాయబద్ధమైన చర్యలను వేగవంతం చేయాలని సీఎం విజయ్ ఆదేశించారు. మేకేడాటు డ్యామ్ ప్రాజెక్ట్ ద్వారా తమ రాష్ట్రానికి తాగునీటి సమస్య తీరుతుందని, విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగపడుతుందని కర్ణాటక ప్రభుత్వం చెబుతోంది.

## విద్యార్థుల ప్రయోజనాలు, వారి ఆరోగ్యమే అన్నింటికంటే ముఖ్యం

2026 జూన్ 21న జరగనున్న నీట్ పునఃపరీక్షను సజావుగా, పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లకు, అడ్మినిస్ట్రేటర్లకు లేఖ రాశారు. ప్రస్తుతం దేశంలో ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యం, హెల్త్‌ను దృష్టిలో ఉంచుకుని పరీక్షా హాళ్లలో అన్ని అవసరమైన ఏర్పాట్లు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.ప్రస్తుత ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మీ రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతంలో పరీక్షలు నిర్వహించే జిల్లా అధికారులు, అన్ని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, అలాగే ఇతర విద్యాసంస్థలకు తగిన ఆదేశాలు జారీ చేయాల్సిందిగా అభ్యర్థిస్తున్నట్లు ఆయన లేఖలో పేర్కొన్నారు. అలాగే అభ్యర్థుల సౌకర్యార్థం సురక్షితమైన తాగునీరు, కూర్చునేందుకు తగిన ఏర్పాట్లు చేయాల న్నారు. విద్యార్థుల ప్రయోజనాలు, వారి ఆరోగ్యమే అన్నింటికంటే ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. పరీక్ష నిర్వహించే రోజున అంటే జూన్ 21న అభ్యర్థుల కోసం తగిన రవాణా సదుపాయాలు కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయా రాష్ట్రాలను కోరారు.

## ప్రభుత్వం పౌరుల జేబులను నిశ్శబ్దంగా దోచుకుంటోంది

ఇంధన ధరల పెంపుపై కాంగ్రెస్ మండిపడింది. ఈ రోజువారీ దోపిడీ వల్ల ఎవరు లబ్ధి పొందుతున్నారని ప్రశ్నించింది. సామాన్య ప్రజల పొదుపును తగలబెట్టడానికి, మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లిందని విమర్శించింది. గత 10 రోజుల్లో ఇంధన ధరలను పెంచడం ఇది నాలుగోసారని ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశాన్ని దోచుకోవడం వల్ల రైతులు, చిన్న పరిశ్రమలు, సమాజంలోని ప్రతి వర్గం నష్టపోతున్నారని ఆరోపించింది. ప్రభుత్వం పౌరుల జేబులను "నిశ్శబ్దంగా దోచుకుంటోంది" కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఎన్నికల సమయంలో ఇంధన ధరలను అదుపులో ఉంచినప్పటికీ, ఇప్పుడు వాటిని విడతల వారీగా పెంచుతున్నారని, ఇకపై అవి మరింత పెరుగుతూనే ఉంటాయని ఆయన ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని 'ద్రవ్యోల్బణ మనిషి మోదీ' అని అభివర్ణిస్తూ, రానున్న 'ఆర్థిక తుపాను' గురించి తాను గతంలోనే హెచ్చరించానని, అయితే ఆ సమయంలో ప్రధానమంత్రి ఎన్నికల ప్రచారంపైనే దృష్టి సారించారని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా ఈ పెరుగుదల ధోరణి ఇలాగే కొనసాగుతుందని రాహుల్ గాంధీ అన్నారు. "ద్రవ్యోల్బణ సూత్రధారి మోదీ మళ్లీ ఆయన పనితనం చూపించారు. మీ జేబును నిశ్శబ్దంగా దోచుకునేలా పెట్రోల్, డీజిల్ ధరలను విడతల వారీగా పెంచుతున్నారు. కానీ మోదీ ఆ ??సమయంలో ఎన్నికలతో బిజీగా ఉన్నారు. ఎన్నికలు ముగియగానే, పెట్రోల్-డీజిల్ ధరను రూ.8 పెంచారు. ఈ పెరుగుదల ఇలాగే కొనసాగుతుంది. ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేయడం, మిగతా సమయంలో ప్రజల జేబులకు చిల్లు పెట్టడమే ద్రవ్యోల్బణ మానవుడు మోదీ చేసే ఏకైక పని"

### 'ఇంధన దోపిడీ ఇంకా ముగియలేదు'

ఇంధన ధరల పెరుగుదలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా స్పందించారు. ఇంధన దోపిడీ ఇంకా ముగియలేదని ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 2004, 2014 మధ్య యూపీఏ ప్రభుత్వ హయాంలో అంతర్జాతీయ చమురు ధరలు 175.34 శాతం పెరిగాయని ఖర్గే వెల్లడించారు. కానీ 2014లో లీటర్ పెట్రోల్ రూ.71.41 మాత్రమే అన్నారు. అదే మోదీ ప్రభుత్వ హయాంలో అంతర్జాతీయ చమురు ధరలు, ఒక్క సెంట్ కూడా పెరగలేదన్నారు. అయినప్పటికీ మోదీ ప్రభుత్వం 2014 నుంచి ఇప్పటి వరకు పెట్రోల్ ధరను 43.01 శాతం పెంచిందన్నారు.

### 67.87 శాతానికి పెరుగుదల

డీజిల్ ధరలను లీటరుకు 56.71 నుంచి 95.20 రూపాయలకు పెంచిందని ఖర్గే విమర్శించారు. ఇది 67.87 శాతం పెరుగుదల అని ఖర్గే చెప్పారు. మోదీ ప్రభుత్వం గత 12 ఏళ్లలో ప్రజల నుంచి 43 లక్షల కోట్లను లూటీ చేసిందని అయన దుయ్యబట్టారు. అంటే రోజూ 1,000 కోట్ల రూపాయల చొప్పున దోపిడీ చేసిందని ఆరోపించారు. ప్రజల కంటే లాభాలకే ప్రాధాన్యత ఇవ్వడం బీజేపీ డీఎన్ఏలోనే ఉందని విమర్శించారు. ప్రతి ఇంధన ధరల పెంపు గృహ బడ్జెట్‌పై మరో దెబ్బ లాంటిదని పేర్కొన్నారు. ఇది ఆర్థిక వ్యవస్థలోని ప్రతి రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. రైతుల నుంచి ఎంఎస్ఎంఈల వరకు సమాజంలోని ప్రతి వర్గం బీజేపీ దోపిడీ వల్ల నష్టపోతోందని ఖర్గే పేర్కొన్నారు. "గత 12 ఏళ్లలో ప్రభుత్వం రూ. 42 లక్షల కోట్లు దోచుకుంది. ఇది రోజుకు దాదాపు రూ.1,000కి సమానం. ప్రతి ఇంధన ధరల పెంపు గృహ బడ్జెట్‌లకు మరో దెబ్బ. ఇది ఆర్థిక వ్యవస్థలోని ప్రతి అంశంపై ప్రభావాన్ని చూపుతుంది. రైతుల నుంచి ఎంఎస్ఎంఈల వరకు, సమాజంలోని ప్రతి వర్గం బీజేపీ దోపిడీ భారాన్ని మోస్తుంది" అని ఖర్గే అన్నారు.

## నీట్ గుణపాఠాలు నేర్చుకోవడం లేదు

దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. గతంలో జరిగిన నీట్ పేపర్ లీక్ ఘటనల నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారానికి సంబంధించిన పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, ఎన్టీఏ, సీబీఐలకు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ అలోక్ ఆరాధే నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. గతంలో కూడా ఇదే అంశం సుప్రీంకోర్టు దృష్టికి వచ్చిందని, అప్పట్లో కోర్టు సూచనల మేరకు మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారని గుర్తుచేసింది. ఆ కమిటీ ఇచ్చిన సిఫారసులు అమలయ్యాయా లేదా అన్న విషయంపై ఎన్టీఏ పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. గురువారం లోపు ఆ నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "ఇది బాధాకరం. గత ఘటనల నుంచి వారు ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదు. ఈ అంశం ఇప్పటికే కోర్టు ముందుకు వచ్చింది. అప్పట్లో ఒక కమిటీ ఏర్పాటైంది. ఆ కమిటీ పలు సూచనలు చేసింది. ఇప్పుడు ఆ సూచనల అమలుపై స్పష్టత కావాలి" అని కోర్టు పేర్కొంది. ఈ వ్యవహారంపై ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా), యునైటెడ్ డాక్టర్స్ ఫ్రంట్ (యూడీఎఫ్) సహా పలు సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. నీట్ పరీక్ష నిర్వహణలో వరుసగా జరుగుతున్న లోపాలు, ప్రశ్నపత్రాల లీకేజీలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నాయని పిటిషనర్లు వాదించారు. ఈ నేపథ్యంలో ఎన్టీఏను పూర్తిగా పునర్వ్యవస్థీకరించాలని లేదా దాని స్థానంలో స్వతంత్ర, పారదర్శక సంస్థను ఏర్పాటు చేయాలని కోర్టును కోరారు. ఈ ఏడాది మే 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ అయ్యిందన్న ఆరోపణలు వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ పరీక్షను ఎన్టీఏ నిర్వహించింది. అయితే లీక్ ఆరోపణలు తీవ్రరూపం దాల్చడంతో మే 12న పరీక్షను రద్దు చేశారు. ప్రస్తుతం ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేస్తోంది. పిటిషనర్ల తరఫున హాజరైన న్యాయవాదులు కోర్టులో కీలక వాదనలు వినిపించారు. ఇప్పటికే 22 లక్షలకుపైగా విద్యార్థులు ఈ వ్యవస్థపై నమ్మకం కోల్పోయారని పేర్కొన్నారు. వరుసగా జరుగుతున్న లీక్ ఘటనలు విద్యార్థుల ప్రాథమిక హక్కులపై నేరుగా దాడి చేసినట్లేనని వాదించారు. పరీక్షల పారదర్శకతను కాపాడేందుకు తక్షణ చర్యలు అవసరమని తెలిపారు. ఇంకా, మళ్లీ నిర్వహించే పరీక్షలను ఒక హైపవర్ కమిటీ పర్యవేక్షణలో నిర్వహించాలని పిటిషనర్లు కోరారు. ఆ కమిటీలో మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తిని ఛైర్మన్‌గా నియమించాలని, సైబర్ సెక్యూరిటీ నిపుణుడు, ఫోరెన్సిక్ శాస్త్రవేత్తలను సభ్యులుగా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. దీంతో భవిష్యత్తులో ఇలాంటి లీకేజీలు జరగకుండా అడ్డుకోవచ్చని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, గతంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి మాజీ ఇస్రో ఛైర్మన్ కె. రాధాకృష్ణన్ నేతృత్వం వహించిన విషయాన్ని కోర్టు గుర్తుచేసింది. ఆ కమిటీ సూచనల అమలుపై కూడా వివరాలు ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. "కోర్టు ఇచ్చిన ఆదేశాల అమలు పరిస్థితిని తెలియజేస్తూ మానిటరింగ్ కమిటీ ఛైర్మన్‌గా కె. రాధాకృష్ణన్ నివేదిక సమర్పించాలి" అని పేర్కొంది. నీట్ పరీక్ష నిర్వహణలో పారదర్శకత, భద్రత అంశాలు మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు వచ్చాయి. ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు వైద్య విద్య ప్రవేశాల కోసం ఈ పరీక్ష రాస్తుంటారు. ఇలాంటి కీలక పరీక్షల్లో వరుసగా లీక్ ఆరోపణలు రావడం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన పెంచుతోంది.

# ఇందిరమ్మ ఇళ్లపై పిడుగు

-మొదటిపేజీ తరువాయి



ప్రస్తుతం మార్కెట్‌లో వ్యాపారులు చెబుతున్న ధరకు, వారు తెస్తున్న సామగ్రి ధరకు తేడా లేకుండా ఒకేలా ఉంది.

**సామాన్యులపై అధనపు భారం :**

కరీంనగర్ జిల్లాలో ఇందిరమ్మ పథకం మొదటి దశ 10,860 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. దానిలో 8,992 ఇళ్లకు మార్కింగ్ చేసి పనులు మొదలుపెట్టారు.

బేస్‌మెంట్ ఫేజ్ 1,601, గోడల దశలో 981, స్లాబ్ దశలో 4,009 ఉన్నాయి. 1,057 నిర్మాణాలు పూర్తితో పాటు గృహ ప్రవేశాలు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో 1,898 ఇళ్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం చేయాల్సి ఉంది.

ఇంటి స్థలం విషయంలో కొందరు కుటుంబ సభ్యుల మధ్య వివాదం ఉండగా, మరికొందరు భూమి కొరత కారణంగా నిర్మాణాలు ప్రారంభించలేకపోయారు. నిర్మాణ సామగ్రి ధరలు పెరగకుండా సర్కారు నియంత్రణ చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఇనుము, సిమెంట్ వంటి నిత్యావసర వస్తువుల ధరలతో పాటు ఇళ్ల నిర్మాణంలో ఉపయోగించే ఇసుక, మట్టి, కంకర, మొరం, కూలీలు, ఇంటి నిర్మాణంలో వాడే కర్రతో పాటు ఇతర సామగ్రి ధరలు ధరలు కూడా పెరుగుతుండటంతో ఇప్పుడు మరింత ఆర్థిక భారంగా మారుతోంది.

"ఇందిరమ్మ ఇళ్లకు తక్కువ ధరకే సామగ్రి అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఆరు నెలల కిందటి కంటే ప్రస్తుతం ఎక్కువ ధరలుండటం, మేస్త్రీలు, సెంట్రింగ్ నిర్వాహకులు కూలీ ధరలు అమాంతం పెంచడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది"

నిర్మాణ సామగ్రి కొరతే కారణం : ప్రస్తుతం ఇంధన ధరలు పెరగడంతో ఇసుక సరఫరాకు మరింత డిమాండ్? పెరిగింది. ప్రభుత్వ సరఫరా అందని పరిస్థితుల్లో ప్రైవేటుగా కొనుగోలు చేయాలంటే వేల రూపాయలు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. అలాగే సిమెంట్?, ఉక్కు, ఇటుక ధరలు సామాన్య పేదలకు అందని స్థాయికి చేరాయి. గతంలో ధరల నియంత్రణ కోసం కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా, అవి కాగితాలకే పరిమితమయ్యాయి.

**రుణాలు, బిల్లుల సమస్యలు**

మహిళా సంఘాల ద్వారా రుణాలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ అనేక చోట్ల క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు, కూలీలు ముందుకు రావడం లేదని, దీంతో లబ్ధిదారులు ఇల్లు కట్టుకోవాలన్నా తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని సమాచారం.

**క్షేత్రస్థాయి చర్యలు అవసరం**

ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయం సాధించాలంటే కేవలం నిధుల విడుదల సరిపోదని ప్రజలు చెబుతున్నారు. నిర్మాణ సామగ్రిపై ధరల నియంత్రణ, ఇసుక సరఫరాకు ప్రత్యామ్నాయ మార్గాలు, రుణాల తక్షణ అమలు, అధికారులు క్షేత్రస్థాయి పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలి. అప్పుడే పేదల ఇళ్ల కల నిజమవుతుందని, లేకపోతే ఆశలతో ప్రారంభమైన ఈ పథకం నత్తనడకనే సాగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మహేష్ గౌడ్‌కు పొగపెడుతున్నారా...

**హైదరాబాద్ :** ఏం జరిగిందో తెలియదు. ఏం జరుగుతుందో కూడా తెలియదు. కాకపోతే మాడు వాసన వస్తోంది. దీనికి బాధ్యులు ఎవరు అనే ప్రశ్న ఎదురైనప్పుడు.. ఎవరు కూడా తమకేం తెలియదు అన్నట్టుగా మొహాలు పెడుతున్నారు.. కానీ ఇలా పార్టీ ప్రజల్లో పరువు పోగొట్టుకుంటుంటే.. ఆ తదుపరి ఏం జరుగుతుందనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీలో జరుగు తున్నది ఇదే.ఆ మీడియా ఛానల్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ కి సంబంధించిన అనుకూలమైన వార్తలు.. ప్రభుత్వానికి సంబంధించిన అడుకూలమైన కథనాలను అది ప్రసారం చేస్తూ ఉంటుంది. అటువంటి చానల్లో ఉన్నట్టుండి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కు వ్యతిరేకంగా కథనాలు ప్రసారమవుతున్నాయి. ఇది ఒక రకంగా ఆశ్చర్యాన్ని కలిగించింది. అసలు మహేష్ కుమార్ గౌడ్ కు పొమ్మనలేక పగబెడుతున్నారా అని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.. ప్రతిష్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన తర్వాత మహేష్ కుమార్ గౌడ్ క్యాడర్ కు దగ్గరగా ఉండటం లేదు.. ప్రభుత్వ పథకాలను ఆయన ప్రచారం చేయడం లేదు. విదేశాలలో ఎక్కువ సమయం ఉంటున్నారు. పార్టీకి సంబంధించిన సామాజిక మాధ్యమాల విభాగాలను కూడా అంతగా శక్తివంతం చేయలేదు. దీంతో భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా రెచ్చిపోతుంది. కొన్ని సందర్భాలలో ప్రభుత్వాన్ని తీవ్రమైన ఇరకాటంలో పెడుతోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా ఉంటే.. మహేష్ కుమార్ గౌడ్ పెద్దగా పట్టించుకోవడంలేదని ఆ చానల్లో వరుసగా కథనాలు ప్రసారం అయ్యాయి.ఆ చానల్ యాజమాన్యంలో కొంతమంది వ్యక్తులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత దగ్గర మిత్రులని తెలుస్తోంది. ఇటీవల మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆ ఛానల్ యాజమాన్యానికి సంబంధించిన దగ్గర వ్యక్తికి ఇవ్వలేదని.. అందువల్లే మహేష్ కుమార్ గౌడ్ మీద ఈ స్థాయిలో నెగిటివ్ వార్తలు ప్రసారం చేస్తున్నారనే వాదనలు లేకపోలేదు. అయితే మహేష్ కుమార్ గౌడ్ ఆ చానల్ తనపై ప్రసారం చేసిన వ్యతిరేక కథనాల పట్ల స్పందించారు. మీడియా మీద గౌరవం ఉంది కాబట్టి తాను ఏమీ అనలేకపోతున్నారని.. కాలమే అన్నిటికి సమాధానం చెబుతుందని ఆయన ప్రకటించారు.ఆ చానల్ ప్రసారం చేసిన కథనాన్ని కాస్త పక్కన పెడితే మహేష్ కుమార్ గౌడ్ టీపిసిసి ప్రెసిడెంట్ అవ్వడానికి ముఖ్య కారకుల్లో రేవంత్ రెడ్డి కూడా. పైగా ఇటీవల ఆయన 2034 వరకు కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో మహేష్ కుమార్ గౌడ్ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బీసీ ముఖ్యమంత్రి అవతారని అన్నారు. రేవంత్ రెడ్డి ఆ ప్రకటన చేసిన తర్వాత.. మహేష్ కుమార్ గౌడ్ బీసీ ముఖ్యమంత్రి అవుతారని ప్రకటించడం సీఎం రేవంత్ రెడ్డికి నచ్చలేదని తెలుస్తోంది. పైగా కాంగ్రెస్ పార్టీలో మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ ఒక వర్గంగా.. రేవంత్ రెడ్డి మరొక వర్గం గా ఉన్నారని ప్రచారం జరుగుతుంది. అయితే మహేష్ కుమార్ గౌడ్ మీద ఇలాంటి కథనం ప్రసారం కావడం పట్ల కాంగ్రెస్లో ఉన్న అంతర్గత పోరు మరొకసారి బయటపడింది. కాంగ్రెస్ పార్టీ దక్షిణ భారత దేశంలో మూడు రాష్ట్రాలలో అధికారంలో ఉంది.. తమిళనాడులో అధికార భాగస్వామి పార్టీగా ఉంది.. అయితే కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పటికీ తెలంగాణనే కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకంగా ఉంది. ఎందుకంటే ఇక్కడ నాయకులు అధిష్టానానికి ఇప్పుడు బలమైన మద్దతు ఇస్తున్నారు. అలాంటప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇలాంటి అంతర్గత పోరుతో అసలుకే మోసం తెచ్చుకునే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.



# పోటెత్తుతున్న వాటర్ ట్యాంకర్లు..

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో ఎండల తీవ్రత పెరగడం, భూగర్భ జలాలు అడుగంటడంతో తాగునీటి కొరత తీవ్రమవుతోంది. దీంతో జలమండలి వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ భారీగా పెరిగింది. మే నెల మొదటి 20 రోజుల్లోనే నగరంలో సుమారు 2.60 లక్షల ట్యాంకర్ల నీటిని సరఫరా చేసినట్లు జలమండలి అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం వారం రోజులుగా రోజుకు సగటున 12 వేలకు పైగా ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు.సాధారణంగా ప్రతి ఏడూ ఏప్రిల్ నెలలో ట్యాంకర్లకు ఎక్కువ డిమాండ్ ఉండి, మే నెల వచ్చేసరికి కాస్త తగ్గుముఖం పట్టేది. గత రెండేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ, ఈ సంవత్సరం మాత్రం భిన్నంగా మారింది. ఏప్రిల్ కంటే మే నెలలోనే ట్యాంకర్ల కోసం బుకింగ్‌లు పోటెత్తుతున్నాయి. గత సంవత్సరం మే నెల మొత్తం మీద కేవలం 1.69 లక్షల ట్యాంకర్ల డిమాండ్ మాత్రమే ఉండగా, ఈసారి మే 20వ తేదీ నాటికే ఆ సంఖ్య 2.60 లక్షలకు చేరింది. రాబోయే రోజుల్లో వర్షాలు పడేవరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.భవిష్యత్తులో నీటి సరఫరాలో మరిన్ని ఇబ్బందులు వస్తాయేమోననే ఆందోళనతో నగరవాసులు పెట్రోల్ కొరత ఏర్పడినప్పుడు నిల్వ చేసుకునే విధంగా, ముందస్తుగా ట్యాంకర్లను బుక్ చేసుకుంటున్నారు. అవసరం లేకపోయినా ముందే ట్యాంకర్లను తెప్పించుకుని నిల్వ చేసుకుంటుండటంతో సరఫరా వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. దీనివల్ల నిజంగా నీటి అవసరం అత్యవసరంగా ఉన్నవారికి సకాలంలో ట్యాంకర్లు అందక ఇబ్బందులు పడుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఒత్తిడిని అధిగమించడానికి, ట్యాంకర్ బుక్ చేసిన 24 గంటల్లోనే సరఫరా చేసేలా జలమండలి ప్రత్యేక చర్యలు చేపట్టింది.హైదరాబాద్ నగరంలో గడిచిన మూడేళ్ల కాలంలో మే నెల మొదటి 20 రోజుల్లో సరఫరా చేసిన వాటర్ ట్యాంకర్ల గణాంకాలను పరిశీలిస్తే డిమాండ్ ఏ స్థాయిలో పెరిగిందో స్పష్టమవుతోంది. 2024 మే 20వ తేదీ నాటికి నగరంలో 1,18,191 ట్యాంకర్ల నీటిని సరఫరా చేయగా, 2025 నాటికి ఆ సంఖ్య 1,69,347 ట్యాంకర్లకు పెరిగింది. ఇక ఈ సంవత్సరం (2026) మే నెలలో ఎండల తీవ్రత తీవ్రరూపం దాల్చడంతో, మే 20 నాటికే రికార్డు స్థాయిలో ఏకంగా 2,59,809 ట్యాంకర్ల నీటిని జలమండలి సరఫరా చేయాల్సి వచ్చింది. గత రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది నీటి కొరత, ట్యాంకర్ల బుకింగ్‌లు ఆల్‌టైమ్ హై రికార్డును నమోదు చేశాయి.




## మహిళల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

మహిళల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. 29 నెలల్లో మహిళల ఉచిత బస్సు ప్రయాణాలకు రూ.10 వేల కోట్లు ఆర్టీసీకి చెల్లించామని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాం ఇవ్వడం కొంతమందికి నచ్చలేదని ఆరోపించారు. మహిళలను బస్సులకు యజమానులు చేశామని, అంబానీ, అదానీ చేసే పెట్రోల్ వ్యాపారం మహిళలు కూడా చేయాలనే బంక్‌లు పెట్టించామని అన్నారు.

మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, బ్యాంక్ లోన్లు చెల్లింపులో నిర్మల్ జిల్లా మహిళా సంఘాలు మొదటి స్థానంలో ఉన్నాయని ప్రత్యేకంగా అభినందించారు. బ్యాంక్ నుంచి రుణాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని, మహిళా సంఘాల ఉత్పత్తుల కోసం గోడౌన్‌లకు స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. మహిళ దగ్గర నుంచే మిల్లర్లు వడ్లు తీసుకెళ్లేలా ప్రణాళికలు చేస్తున్నామని వెల్లడించారు.

**ఆడబిడ్డల ఆశీర్వాదం ఉంటేనే**

మహిళా శక్తి సూపర్ బజార్‌లు ఏర్పాటు చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. మహిళా శక్తి సూపర్ బజార్‌లో మహిళలు పెట్టుబడి పెట్టాలని కోరారు. నాణ్యమైన ఉత్పత్తులకు మహిళా శక్తి సూపర్ బజార్‌లు చిరునామాగా మార్చండని తెలిపారు. సొంత చెల్లినే ఇంట్లో నుంచి వెళ్లగొడుతున్నారని, తాము మహిళలను ఆడపడుచుగా భావించి చీరలు పంచుతున్నామని, ఆడబిడ్డల ఆశీర్వాదం ఉంటే ప్రజా ప్రభుత్వం కలకాలం ఉంటుందని వివరించారు.

**మహిళ సంఘాల భవనాల శంకుస్థాపన**

రాష్ట్రవ్యాప్తంగా 8వేల మహిళ సంఘాల భవనాల శంకుస్థాపన కార్యక్రమాన్ని సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క, సీతక్క, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. వర్చువల్‌గాస్వయం సహాయక సంఘాల మహిళలు, కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు. "మహిళా సంఘాలు ఉత్పత్తుల గోడౌన్‌లకు స్థలాలు ఇస్తాం. బ్యాంక్ నుంచి రుణాలు ఇప్పించి మహిళలతో రైస్ మిల్లులు పెట్టించే బాధ్యత తీసుకుంటాం. మహిళా సంఘాలు రైస్ మిల్లులు, గౌడౌన్లు పెట్టుకోవడానికి ప్రభుత్వం సహకారం అందిస్తుంది. దళారులు, వ్యాపారులు రైతులను మోసం చేస్తున్నారని గుర్తించి ఇకపై మహిళా సంఘాల వద్దే వడ్లు భద్రపరుస్తారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాం ఇవ్వడం కొంతమందికి నచ్చలేదు. మహిళలను బస్సులకు యజమానులు చేశాం. అంబానీ, అదానీ చేసే పెట్రోల్ వ్యాపారం మహిళలు కూడా చేయాలనే బంక్‌లు పెట్టించాం. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. మహిళా శక్తి సూపర్ బజార్‌లు ఏర్పాటు చేస్తాం. మహిళా శక్తి సూపర్ బజార్‌లో మహిళలు పెట్టుబడి పెట్టండి. నాణ్యమైన ఉత్పత్తులకు మహిళా శక్తి సూపర్ బజార్‌లు చిరునామాగా మార్చండి. ఆడబిడ్డల ఆశీర్వాదం ఉంటే ఈ ప్రభుత్వం కలకాలం ఉంటుంది"

## నైరుతి రుతుపవనాల ఆగమనం మరింత ఆలస్యం

-మొదటిపేజీ తరువాయి

ఉందని చెప్పింది. ఈ ఏడాది మాన్‌సూన్ సీజన్‌పై ఎల్‌నినో ప్రభావం పడనుందని.. జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్‌లో దీని ప్రభావం చూపనుందని వెల్లడించింది. దీంతో తెలంగాణలో లోటు వర్షపాతం నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ అనేక ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. నగరంలోని అనేక చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్‌లో భారీ వర్షం కురవగా.. ఘట్‌కేసర్‌లో వడగాళ్ల వర్షం పడింది.

**విద్యుత్ సరఫరాకు అంతరాయం**

మెదక్ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. వర్షం కారణంగా జిల్లా కేంద్రంలోని గంగినేని థియేటర్ సమీపంలో రోడ్ జలమయమైంది. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్?కు తీవ్ర అంతరాయం కలిగింది. జిల్లాలోని ర్యాలమడుగు గ్రామంలో వర్షం కారణంగా ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నెలకొరిగింది. ఇదే తరహాలో మంభోజిపల్లి గ్రామంలో కురిసిన భారీ వర్షంతో పాటు ఈదురు గాలుల కారణంగా 3 విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

తడిసి ముద్దయిన వడ్లు వర్షం కారణంగా మెదక్ మార్కెట్ యార్డ్‌లో ధాన్యం బస్తాలు తడిశాయి. మగ్దుంపూర్ కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన 2 లారీల వడ్లు తడిసి ముద్దయ్యాయి. ధాన్యం తడిసిపోవడంతో రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

**ఈదురు గాలులకు చెట్లు నేలమట్టం**

సూర్యాపేట జిల్లాలోని పాలకవీడు మండలంలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఆ ప్రాంతంలోని కొన్ని చోట్ల ఈదురు గాలులకు అనేక చెట్లు నేలమట్టం అయ్యాయి. ఒరిగిన విద్యుత్ స్తంబాలు, తెగిన విద్యుత్ వైర్లు కారణంగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈదులుగాలుల కారణంగా జిల్లాలోని పాలకవీడు మండలం చెరువు తండా గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలి ఇంటి పైకప్పుగా ఉన్న రేకులు నేలమట్టం అయ్యాయి. దీంతో ఇంట్లోని సామాగ్రి తడిసి ముద్దయింది. దీంతోపాటు జిల్లాల్లో పలు ప్రాంతాల్లో వర్షం కారణంగా ఆస్తి నష్టం వాటిల్లింది.

## వారి రేషన్ కార్డు రద్దు

-మొదటిపేజీ తరువాయి

ఉండటం, ఐటీ రిటర్న్లు దాఖలు చేసేవారిని గుర్తించి అనర్హులుగా ప్రకటిస్తున్నారు.

**ప్రభుత్వ విచారణలో తేటతెల్లం..**

ఇక అధిక జీతాలు పొందుతున్న ప్రైవేట్ ఉద్యోగులను కూడా గుర్తించి రేషన్ కార్డు కట్ చేస్తున్నారు. కొంతమంది తప్పుడు సమాచారంతో రేషన్ కార్డు పొంది ఇన్నాళ్లూ ప్రభుత్వ పథకాలు పొందుతున్నారు. దీంతో వీరిని గుర్తించే ప్రక్రియను రేవంత్ సర్కార్ చేపట్టి అనర్హులను ఏరివేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాలు చేసే కొంతమంది కూడా రేషన్ కార్డు పొంది ఉన్నారు. ఇక నెలకు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు జీతాలు పొందే సాఫ్ట్ వేర్ ఉద్యోగులు కూడా రేషన్ కార్డు కలిగి ఉన్నారు. సాఫ్ట్ వేర్ ఉద్యోగులు కొంతమంది ఇప్పటివరకు తమ తల్లిదండ్రుల రేషన్ కార్డుల్లో కొనసాగడం వల్ల వారి వివరాలు తెలియలేదు. కానీ తల్లిదండ్రుల నుంచి విడిపోయి ప్రత్యేకంగా కొంతమంది కార్డులు పొందారు. దీంతో వీరి వివరాలు ఇప్పుడు బహిర్గతం కావడంతో గుట్టు రట్టయింది. డేటా విశ్లేషణ, అధికారుల క్షేత్రస్థాయి పరిశీనలో వీళ్లు అనర్హులుగా ఉన్నట్లు బయటపడింది.

**వీరి రేషన్ కార్డు కట్**

-గ్రామీణ ప్రాంతాల్లో 3.20 ఎకరాల కంటే ఎక్కువ తరి భూమి ఉండటం

-7.20 ఎకరాల కంటే ఎక్కువ కుష్కి భూమి ఉండటం

-వార్షిక ఆదాయం రూ.6 లక్షల కంటే ఎక్కువగా ఉండటం

-ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లిస్తూ ఉండటం

## వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హతమార్చిన భార్య

**ప్రియుడితో కలిసి హత్య చేసి, జేసీబీ సహాయంతో మృతదేహం పూడ్చివేత**

**సంగారెడ్డి** వివాహేతర సంబంధానికి అడ్డుగా వున్నాడని భర్తను భార్యే హతమార్చింది. పైగా ప్రియుడితో కలిసి మృతదేహాన్ని జేసీబీ సహాయంతో పూడ్చివేసింది. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం గంగాపూర్ గ్రామంలో నివసిస్తూ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కల్పన నర్సుగా పని చేస్తోంది. కొన్ని నెలలుగా ఎల్గోయి గైని పండరి అలియాస్ చింటూ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని, అడ్డుగా ఉన్నాడని ఈ నెల 16వ తేదీన భర్త ముత్యంరెడ్డిని హతమార్చింది. చనిపోయిన తన సోదరుడికి సమాధి కట్టిస్తామని చెప్పి జేసీబీ సహాయంతో గ్రామ శివారులోని తన పొలంలో గుంత తవ్వించి, భర్త మృతదేహాన్ని పూడ్చిపెట్టింది. తరువాత ఈ నెల 18వ తేదీన భర్త కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది నిందితురాలు. విచారణ క్రమంలో అనుమానం వచ్చి నిలదీయగా, తన ప్రియుడితో కలిసి తానే ముత్యం రెడ్డిని హతమార్చినట్లు అంగీకరించింది. దీంతో 9 రోజుల తరువాత పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి, నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.


## సంపాదకీయం

# తెలుగు రాష్ట్రాల్లో సర్ సెగలు

దేశవ్యాప్తంగా పలు వివాదాలతో సంచలనం రేపుతున్న ఓటర్ల జాబితా ప్రక్షాళన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) సెగ ఇక తెలుగు రాష్ట్రాలకు తాకనుంది. వేసవి కాలం ముగిసి తొలకరి రుతుపవనాలు ప్రవేశించే జూన్ నెలలో తెలంగాణలో 'సర్' వేడి మొదలుకానుంది. ఇప్పటికే దేశంలో రెండు దశల్లో ముగిసిన ఓటర్ల జాబితా ప్రక్షాళన తుది మూడో దశలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో సహా మొత్తం 16 రాష్ట్రాల్లో, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో చేపట్టనున్నారు. మొదటి రెండు దశల్లో పశ్చిమబెంగాల్, అసోం, బీహార్, తమిళనాడు, కేరళ, రాష్ట్రాల్లో అక్కడి అసెంబ్లీ ఎన్నికల ముందు 'సర్' ప్రక్రియ నిర్వహించడంతో ఎన్నికల్లో కీలకాంశంగా మారింది. ఇప్పుడు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు చాలా కాలం ఉన్నా రాష్ట్రంలో 'సర్' రాజకీయ వేడి పుట్టించింది. స్వయం ప్రతిపత్తి సంస్థ అయిన ఎన్నికల సంఘం ఎలాంటి విమర్శలు ఎదుర్కోకుండా నిష్పక్షపాతంగా తెలంగాణలో 'సర్'ను విజయవంతంగా పూర్తిచేయాలని రాష్ట్ర ఓటర్లు కోరుకుంటున్నారు. కాలానుగుణంగా దేశంలో ఓటర్ల జాబితాను ప్రక్షాళించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. దేశంలో ఇంతకుముందు 195152, 1960, 1980, 1993, 1995, 2002 2004 సంవత్సరాల్లో దేశంలో 'సర్' ప్రక్రియ నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాను సవరించారు. 2025 26లో భాగంగా తొలుత బీహార్‌లో, అనంతరం 12 రాష్ట్రాల్లో 'సర్' నిర్వహించి, ఇప్పుడు చివరగా 16 రాష్ట్రాల్లో, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 'సర్' చేపట్టేందుకు సిద్ధమైంది. ఓటర్ల జాబితాలో డూప్లికేట్, చనిపోయిన వారు, చిరునామా మారిన వారు, రెండు చోట్ల ఓట్లు ఉన్నావారు, అర్హత లేని వారి పేర్లను తొలగించి ప్రక్షాళన చేయడమే 'సర్' లక్ష్యమని ఎన్నికల సంఘం పదేపదే చెబుతున్నా దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమియేతర పార్టీలు మాత్రం 'సర్' ప్రక్రియను 'ఎంపిక చేసిన ప్రక్షాళన'గా విమర్శిస్తున్నాయి. దీనిపై పలు రాజకీయ పార్టీలు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నాయి. 'సర్' ప్రక్రియ ఏ ఒక్క పార్టీకి అనుకూలంగా నిర్వహించడం లేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత భారత ఎన్నికల సంఘంపైన ఉంది. ఓటర్ల జాబితా ప్రక్షాళన పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని ఎన్నికల సంఘం చెబుతున్నా తెలంగాణలో రాజకీయ పార్టీలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం అధికారులను కలిసి తమ సందేహాలు, సూచనలు తెలియజేస్తున్నారు. పార్టీలు తమ నేతలను, కార్యకర్తలను 'సర్'పై జాగృతం చేశాయి. మొదటి రెండు దశ 'సర్' ప్రక్రియలో దాదాపు 7.2 కోట్ల ఓట్లు తొలగించబడ్డాయి. అదే సమయంలో సుమారు 2 కోట్ల మంది ఓటర్లను చేర్చారు. రాష్ట్రాలవారీగా పరిశీలిస్తే బీహార్‌లో 65 లక్షలు (8.3%), ఉత్తరప్రదేశ్‌లో 2.5 కోట్లు (13%), తమిళనాడులో 97.3 లక్షలు (14%), పశ్చిమబెంగాల్‌లో 90 లక్షలు (11%), గుజరాత్‌లో 70 లక్షలు (14.5%), మధ్యప్రదేశ్‌లో 34.25 లక్షలు (6%), రాజస్తాన్‌లో 31 లక్షలు (5.7 చ), చత్తీస్‌గఢ్ లో 25 లక్షలు (11%) ఓట్లు 'సర్'లో తొలగించారు. మరోవైపు గోవా, లక్షద్వీప్, అండమాన్ నికోబార్‌లో పూర్తి గణాంకాలు వెల్లడి కాలేదు. సర్' ప్రక్రియ చేపట్టిన రాష్ట్రాల్లో ప్రధానంగా బీహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, గుజరాత్, అసోంలో వివాదాలు రేగాయి. బీహార్‌లో మొదట కోటి వరకు ఓట్లు తొలగిస్తారనే ప్రచారం జరిగినా రాజకీయ దుమారం, న్యాయస్థానాల జోక్యంతో చివరికి 65 లక్షల ఓట్లు రద్దు అయ్యాయి. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్‌లో 'సర్' దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఉన్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టు పారదర్శకత కోసం న్యాయమూర్తులను పరిశీలకులుగా నియమించి ప్రజాస్వామ్యంపై భరోసా కలిగించింది. పలు సందర్భాల్లో ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చింది. పశ్చిమబెంగాల్‌లో బిఎల్‌ఒలపై ఒత్తిడి పెరిగి దురదృష్టవశాత్తు కొంత మంది మరణించిన ఘటనలు కూడా జరిగాయి. అసెంబ్లీ ఎన్నికల ముగిసిన తర్వాత కూడా ఇంకా పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల తొలగింపు కేసులు న్యాయస్థానాల్లో ఉన్నాయి. తమిళనాడులో నాడు అధికారంలో ఉన్న డిఎంకె 97 లక్షల ఓట్ల తొలగింపుపై ఎన్నికల సంఘాన్ని తప్పుపట్టింది. అసోంలో అక్రమ బంగ్లాదేశ్ వలసదారుల అంశంతో 'సర్' సున్నితంగా మార్చింది. పలు రాష్ట్రాల్లో 'సర్' వివాదాస్పదమైన నేపథ్యం లో తెలంగాణలో కూడా ఎలా జరుగుతుందో అదే ఆందోళన కలగడం సహజమే. తెలంగాణలో 'సర్' నిర్వహణలో భాగంగా 2026 జూన్ 25 నుంచి జూలై 24 వరకు బిఎల్‌ఒలు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను ధ్రువీకరించనున్నారు. జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి, ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. తుది జాబితా అక్టోబర్ 1 లేదా అక్టోబర్ 10న విడుదల చేసే అవకాశముంది. రాష్ట్రంలో ఇప్పటికే ర్యాండవ్? మ్యాపింగ్ చేపట్టారు. 2002 ఓటర్ల జాబితాతో సరిపోలుస్తూ మ్యాపింగ్ నిర్వహిస్తున్నారు. తెలంగాణలో ప్రస్తుతం 3.32 కోట్ల మంది ఓటర్లుండగా ఇప్పటివరకు జరిగిన మ్యాపింగ్ ఆధారంగా 50 లక్షలకుపైగా ఓటర్లు తగ్గవచ్చనే అంచనాలున్నాయి. ఎన్నికల సంఘం రూపొందించిన 'డెమోగ్రఫీ సిమిలర్ ఎంట్రీస్' సాఫ్ట్‌వేర్‌తో బోగస్, డూప్లికేట్, రెండు చోట్ల ఉండే ఓట్లు తొలగించే వీలుంది. ప్రధానంగా గ్రేటర్ శివార్లలో, కొత్త కాలనీల్లో భారీగా ఓట్లు తొలగించడం, జోడించడం జరిగే అవకాశాలున్నాయి. బిఎల్‌ఒలు, ఎన్యూమరేటర్లు రెండు మూడు సార్లు వచ్చి మరీ తనిఖీలు చేసిన తర్వాతనే తుది జాబితాను రూపొందిస్తారు. ఓటరు రిసిప్ట్ కాపీని డిజిటల్ రికార్డులో భద్రపరుస్తారు. ఓటర్లు 11 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి తమ రుజువుగా చూపించవచ్చని ఎన్నికల సంఘం ప్రకటించింది ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్‌లో 'సర్'లో కేంద్రబిందువుగా మారే అవకాశాలున్నాయి. నగరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో ఎపి నుంచి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడిన వారితోపాటు ఇతర దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు భారీగా ఉన్నారు. వీరిలో కొందరికి రెండు రాష్ట్రాల్లోనూ ఓట్లుండే అవకాశాలున్నాయి. మ్యాపింగ్‌లో ఓటర్లు కనిపించకపోవడంతో ఇక్కడ 'సర్' ప్రక్రియలో ఓట్లు తొలగింపు వివాదం కావచ్చు. నగరంలో బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు నకిలీ పత్రాలతో ఓటర్లుగా ఉన్నారనే ఆరోపణలున్న నేపథ్యంలో సదరు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు నెలకొనే అవకాశాలుంటాయి. సున్నిత ప్రాంతాల్లో అధికారులు పూర్తి జాగ్రత్తలు తీసుకొని 'సర్'ను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే నగరంలో మ్యాపింగ్ చేపట్టడంలో కొన్ని రాజకీయ పార్టీలు జోక్యం చేసుకోవడంతో అనర్హులు విధులు నిర్వహిస్తున్నరనే ప్రచారం జరుగతున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోతే తెలంగాణలో కూడా 'సర్' వివాదాస్పదమయ్యే అవకాశాలున్నాయి.ఓటర్ల జాబితా ప్రక్షాళనలో ఎన్నికల సంఘంతోపాటు రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. పోలింగ్ బూత్ స్థాయిలో అధికారిక బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్‌ఒ), రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్ (బిఎల్‌ఎ) పాత్ర క్రియాశీలకమైంది. తెలంగాణలో ఒక్కో బిఎల్‌ఒ పరిధిలో సగటున 930 మంది ఓటర్లున్నారు. రాజకీయ పార్టీలు బూత్ స్థాయిలోనే ఓటర్ల జాబితా రూపొందిస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉంటే వివాదాలు అరికట్టవచ్చు. ప్రజాస్వామ్యానికి ఎన్నికల ప్రక్రియ పునాది. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా కీలకం. ఓటర్ల జాబితా ప్రక్షాళన 'సర్'పై రాజకీయ ఒత్తిళ్లు లేకుండా, పారదర్శకంగా ప్రక్రియ సాగితేనే ప్రజల్లో ఎన్నికల వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది. అనర్హులను తొలగించి అసలైన అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తే దేశంలో వివాదాస్పదం అవుతున్న 'సర్' నిర్వహణలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది. కాబట్టి 'సర్' ప్రక్రియ రాజకీయ వివక్ష లేకుండా నిజాయితీగా, పారదర్శకంగా జరిగితేనే ఎన్నికల సంఘం చెబుతున్న "ప్యూరిఫికేషన్"పై ప్రజల్లో "క్లారిఫికేషన్" వస్తుంది. 'సర్' అందరికీ సమ్మతం కావాలి. లేదంటే తెలంగాణలో కూడా 'సర్' మరో రాజకీయ తుపానుగా మారే అవకాశాన్ని కొట్టిపారేయలేం.

# ముసుగులు తొలగిన మతతత్వం!


'వారు నాకు ఓటు వేయలేదు. వారి బాగోగులకు నేను బాధ్యత వహించను'-- పశ్చిమ బెంగాల్ శాసనసభకు కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యే రితేశ్ తివారీ అన్న మాటలవి. ఈ ఉద్ఘాటన మానవ ధర్మ ప్రేరితమేనా? ఒక్క క్షణం ఆలోచించండి. ఆ మాటల్లోని అనైతికత, దుర్మార్గం అర్థమవుతుంది. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికైన ప్రజాప్రతినిధి అలా మాట్లాడవచ్చునా? పరిపాలన, పౌరసత్వ హక్కులు ఇప్పుడు మతపరమైన ఓటింగ్ సరళిపై ఆధారపడి ఉన్నాయని ఆ ప్రజాప్రతినిధి ప్రభావశీలంగా సూచించడమే కాదూ ఆ ప్రకటన? ముస్లింలు తనకు ఓటు వేయనప్పుడు తాను ప్రాతినిధ్యం వహించేందుకు వారు సరైన అర్హులు కారని ఆ బెంగాలీ ఎమ్మెల్యే ఆ మాటలతో చెప్పకనే చెప్పాడు. రవీంద్రుడి ఆత్మ క్షోభించి ఉంటుంది. విశాల భారతావని ఆ మహాకవిని మరచిపోనట్లయితే కొత్త 'ప్రజాప్రతినిధి' కుత్సిత పలుకులకు భగ్గుమనేది కాదూ? అలా జరగలేదు! ఇదే, బహుశా, ఈ బెంగాల్ ముచ్చటలోని అత్యంత ఆందోళనకరమైన విషయం. వర్తమాన భారతదేశంలో నేడు మనం కంటున్నవీ వింటున్నవీ కేవలం మతతత్వ రాజకీయాలు కావు. అవి ఇంతకు ముందు కూడా ఉన్నాయి. ఇప్పుడు మనం చూస్తోంది మతతత్వ రాజకీయాల సర్వవ్యాపకత్వం. అవును, అవి సర్వసాధారణమైపోయాయి. ఆ బెంగాలీ అన్న మాటలను గతంలో ఎవరైనా వదరి ఉంటే వారి రాజకీయ జీవితాలకు అవి భరతవాక్యాలు అయివుండేవి. అయితే ఇప్పుడు అవి కేవలం ఎన్నికల ప్రలాపమని, పట్టించుకోవల్సినంత ముఖ్యమైనవి ఏ మాత్రం కావని కొట్టివేస్తున్నారు! మత ప్రాతిపదికన ప్రజలను సమీకరించేందుకు రాజకీయులు ఇంకెంత మాత్రం సంకోచించడం లేదు. గతంలో గోప్యంగా చేసిన ఆ పనిని ఇప్పుడు బాహాటంగా అడ్డూ అదుపులేని రీతిలో నిస్సంకోచంగా చేస్తున్నారు. అందుకే కాబోలు భారత జాతీయ కాంగ్రెస్‌ను 'కొత్త ముస్లిం లీగ్' అని కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు అభివర్ణించారు. రిజిజు వ్యాఖ్య వెనుక ఉన్న వాదన ఏమిటో నిశితంగా చూద్దాం. అసోం, బెంగాల్ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు అందరూ దాదాపుగా ముస్లిం అభ్యర్థులే అయినందున కాంగ్రెస్ ఒక మతతత్వ పార్టీగా పరిణమించింది. అవును, అసోంలో ఎన్నికైన 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో 18 మంది ముస్లింలే. అలాగే బెంగాల్‌లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు ఇరువురూ ముస్లింలే. సరే, కేరళలో కాంగ్రెస్ మిత్రపక్షం ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఎన్నికల్లో జయాపజయాలను ప్రభావశీలంగా నిర్ణయించే రాజకీయ శక్తి. అయితే కాంగ్రెస్‌ను మతతత్వ పార్టీగా నిందిస్తున్నవారు ఒక వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు 650 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో అత్యధికులు ముస్లిమేతరులే. అయినప్పుడు కాంగ్రెస్ మతతత్వ పార్టీ ఎలా అయింది? ఆ ప్రశ్నకు సమాధానం అంక గణితంలో కాకుండా రాజకీయ సందేశం-- ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసేందుకు చేసే ప్రసంగాలు, ప్రకటనలు సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారం-- లో ఉన్నది. ముస్లింల రాజకీయ ప్రాతినిధ్యాన్ని అనుమానాస్పదం చేయడమే అసలు లక్ష్యం. ప్రధానస్రవంతి ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులుగా ముస్లిం అభ్యర్థులు చెప్పుకోదగిన సంఖ్యలో ఎన్నికైనప్పుడు సదరు పార్టీపై మతతత్వ పార్టీ అనే ముద్ర వేయడమే అటువంటి వ్యాఖ్యలు చేసేవారి అభీష్టం. మైనారిటీ వర్గాల ప్రాతినిధ్యాన్ని చట్టవిరుద్ధం చేయడం, మెజారిటీ వర్గ ఆధిపత్యాన్ని జాతీయ వాదంగా చూపడమే రిజిజు వ్యాఖ్య పరమార్థం. ఈ రాజకీయ విలోమం చాలా చాలా ప్రమాదకరమైనది. బెంగాల్‌లో సువేందు అధికారి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన హిందువులకు బీజేపీకి ఓటువేయమని బహిరంగంగా విజ్ఞప్తి చేశారు. గెలిచిన తరువాత వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే ఏ ప్రతిపక్ష నాయకుడు అయినా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ముస్లిం ఓటర్లకు తమ పార్టీకి ఓటువేయమని విజ్ఞప్తి చేసి ఉంటే ఏమయివుండేది? లౌకికవాదాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత హిందువులపైనే ఎందుకు మోపుతున్నారని పలువురు తరచు ప్రశ్నిస్తున్నారు. ముస్లిం ఓటర్లు ప్రధానంగా ముస్లిం అభ్యర్థులకే ఎందుకు ఓటు వేస్తున్నారు? ముస్లిం ఓటర్లు అత్యధికంగా ఉన్న నియోజకవర్గం నుంచి హిందూ అభ్యర్థి



విజయం సాధించగలడా? ఇవి న్యాయబద్ధమైన ప్రశ్నలే. వీటికి సమాధానం ఒక రాజకీయ వాస్తవాన్ని గుర్తించడంలో ఉన్నది: భారత జనాభాలో హిందువులు 80శాతంగా ఉన్నారు. పరిపూర్ణ భద్రతా భావంతో నిండు ఆత్మ విశ్వాసంతో ఉన్న మెజారిటీ హిందువులు మాత్రమే దేశం మెజారిటేరియన్ జాతీయవాదంలోకి జారిపోకుండా నివారించగలరు. సరే, లౌకికవాదం బలహీనపడడం బీజేపీతో మాత్రమే ఆరంభమయిందా? అలా భావించడం, ఆ సంక్షోభానికి ఆ పార్టీనే తప్పుపట్టడమంటే ఆత్మ వంచన చేసుకోవడమే అవుతుంది. లౌకికవాద పార్టీలుగా పరిగణన పొందుతున్న రాజకీయ పక్షాలు రెండు చారిత్రక తప్పిదాలకు పాల్పడ్డాయి. ముస్లింల సామాజిక పురోగతి, ఆర్థికాభ్యుదయానికి చిత్తశుద్ధితో కృషి చేయకుండా వారిని తమ ఫిక్స్‌డ్ డిపాజిట్ ఓటు బ్యాంకుగా చూడడం మొదటి చారిత్రక నేరం. మితవాద ముస్లిం మతాచార్యుల ఒత్తిడికి లొంగిపోయి షాబానో కేసు తీర్పును కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడమైనా, లేదా ప్రాంతీయ పార్టీలు తమ ప్రతీకాత్మక రాజకీయాల ద్వారా ముస్లింల అభద్రతా భావాన్ని స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడమైనా ముస్లింలకు తరచు పంపుతున్న సందేశం: మాకు ఓటు వేయండి. మిమ్ములను హిందూ మితవాదుల నుంచి సంరక్షిస్తాం. సంరక్షణ రాజకీయంగా మారింది. అయితే సాధికారత అరుదుగా లభించింది. లౌకికవాద పార్టీలు పాల్పడిన రెండో చారిత్రక తప్పిదం కూడా మొదటిదాని వలే లౌకికవాద విలువలకు తీవ్ర నష్టం చేసింది. హిందూ ఓట్లను బీజేపీకి కోల్పోతామనే భయంలో లౌకికవాదాన్ని దృఢవిశ్వాసంతో పరిరక్షించడానికి బదులుగా మృదు హిందుత్వను పాటించడంలో ఉత్సాహం చూపాయి. తద్వారా బీజేపీని సమర్థంగా ఎదుర్కోగలమని విశ్వసించాయి. 1980ల్లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం బాబ్రీమసీదుకు దశాబ్దాలుగా వేసి ఉన్న తాళాలను తెరవడాన్ని గుర్తు చేసుకోండి. అలాగే 2017లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ సందర్శించని హిందూ దేవాలయం ఏదైనా ఉన్నదా? లౌకికవాద పార్టీలు ఎప్పుడైతే మృదు హిందూత్వను పాటించడంలో నిమగ్నమయ్యాయో అప్పుడే మతవాద భావజాలానికి రాజకీయ ఆమోదం లభించేందుకు అనుద్దేశపూర్వకంగా తోడ్పడ్డాయి. దీనికి తోడుగా అస్తిత్వ రాజకీయాలు ప్రబలమయ్యాయి. ముస్లింలకు మరింత అధికంగా రాజకీయ ప్రాతినిధ్యం, వారు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలు మొదలైన అంశాల ప్రాతిపదికన అసదుద్దీన్ ఓవైసీ తదితర ముస్లిం నాయకులు అస్తిత్వ రాజకీయాలను బలోపేతం చేశారు. మృదు హిందుత్వ, అస్తిత్వ రాజకీయాలు ఒక విషవలయమై మున్నెన్నడూ లేని ప్రమాదకర పరిస్థితికి దారితీశాయి. హిందూ మెజారిటీవాద రాజకీయ ప్రలాపాలు ముస్లింలలో అభద్రతా భావాన్ని పెంపొందించాయి. ఈ అభద్రత ముస్లిం అస్తిత్వ రాజకీయాలను బలోపేతం చేశాయి. తీవ్రవాద ముస్లిం రాజకీయాలు హిందువుల్లో భయాందోళనలు సృష్టించి మితవాద, మతవాద భావజాలాలవైపు మొగ్గేలా చేశాయి. ఇదిలా వుండగా రాజ్యాంగ బద్ధ పాలన కుంచించుకుపోవడం అంటే రాజ్యాంగ సంస్థలు బలహీనపడడం, సమాఖ్య పాలనా పద్ధతులు క్షీణించడం, ప్రజాస్వామ్య నియమాల ఉల్లంఘన ఆరంభమయింది. రాజకీయ ఆమోదయోగ్యతను మతపరమైన గుర్తింపు నిర్ణయించడమే ఆ విపత్కర మార్పుకొక నిదర్శనం. దశాబ్దాల క్రితం ఎ.ఆర్. అంతూలే మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. హిందూ ఓటర్లు అత్యధికంగా ఉన్న కాన్పూర్ నుంచి 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా అరిఫ్ మహమ్మద్ ఖాన్ గెలుపొందారు. ఇప్పుడు అటువంటి విజయాలను ఊహించగలమా? 20 కోట్ల మందికి పైగా ముస్లింలు ఉన్న భారత్‌లో ఒక్క రాష్ట్రానికి సైతం ముస్లిం ముఖ్యమంత్రి లేదు; 18 రాష్ట్రాలలో ముస్లిం మంత్రి ఒక్కరంటే ఒక్కరూ లేరు; బెంగాల్‌లో మూడింట రెండు వంతుల మెజారిటీతో విజయం సాధించిన బీజేపీ ఎమ్మెల్యేలలో ఒక్క ముస్లిం కూడా లేదు; పన్నెండేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తరపున లోక్‌సభకు ఎన్నికైన ముస్లిం ఎంపీ ఒక్కరూ లేరు. హిందూత్వ అప్రతిహత పురోగతి మూలంగా రాజకీయ భారతంలో ముస్లింలు ఉనికిని దాదాపుగా కోల్పోయినట్టుగా కనిపిస్తోంది. ఒక మత వర్గాన్ని ప్రధానస్రవంతి రాజకీయాల నుంచి మినహాయిస్తే 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' (అందరి సహకారంతో అందరి అభివృద్ధి) అనే పాలనా ఆదర్శం ఎలా సాకారమవుతుంది? ఇవి ఇబ్బందికరమైన ప్రశ్నలు. అయితే పాలకులకు బాధాకరమనిపించే ప్రశ్నలు అడగడాన్ని ఆపివేస్తే ప్రజాస్వామ్యం నశించిపోతుంది. మతతత్వ రాజకీయాలను ఇప్పుడు ఇంకెంత మాత్రం పథ భ్రష్ట వ్యవహారాలుగా చూడకపోవడమే వర్తమాన భారతదేశ అసలు విషాదం. వాటిని ఎన్నికల సర్వసాధారణ విషయంగా అంగీకరించడం అంతకంతకూ అధికమవుతోంది. ఇదే నిజమైన ప్రమాదం. మన ప్రజాస్వామ్యానికి సంభవిస్తున్న ఎనలేని హాని. దేశ పౌరులు ప్రాథమికంగా ఒకరినొకరు సహచర భారతీయులుగా కాకుండా హిందువులుగా, ముస్లింలుగా భావించుకోవడం ప్రారంభమైతే మన రాజ్యాంగ లౌకికవాదం అంతఃశక్తిని కోల్పోయి నిరర్థకమవుతుంది. ఇదే సంభవిస్తే మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యం సంకుచితమైపోతుంది. పౌరసత్వ విశాల భావనలు నశించిపోతాయి. మతవిశ్వాసాలకు అతీతంగా అందరికీ సమాన హక్కులు మృగ్యమైపోతాయి. స్వరూప స్వభావాలు మారిపోయిన రాజకీయ భారతం అశుభ సూచకమైన 'హిందూ పాకిస్థాన్' సదృశమవుతుంది.

# బొగ్గు నుంచి గ్యాస్

**ముంబై :** భారతదేశం ఇంధన దిగుమతులపై ఎంతగా ఆధారపడి ఉందో ఇటీవలి ఘటనలు మరోసారి ఉద్ఘాటించాయి. ఎల్‌ఎన్‌జీలో 42 శాతం ఖతార్ నుంచి భారత్ దిగుమతి చేసుకుంటోంది. అయితే తాజాగా పశ్చిమాసియా యుద్ధం కారణంగా అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడిచేశాయి. ఇరాన్ గల్ఫ్ దేశమైన ఖతార్‌పై దాడిచేసింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తలెత్తడంతో భారత్‌కు ఎల్‌ఎన్‌జీ సరఫరా 30 శాతం పడిపోయింది. ప్రపంచవ్యాప్తంగా 17 శాతం గ్యాస్ సరఫరా తగ్గడం కేవలం భారత్ సమస్య మాత్రమే కాదు, అంతర్జాతీయ ఇంధన మార్కెట్ స్థిరత్వానికి కూడా హెచ్చరిక.కేంద్ర ప్రభుత్వం ఎల్‌ఎన్‌జీ కొరత తీర్చడానికి కీలక నిర్ణయం తీసుకుంది. 37,500 కోట్ల రూపాయలతో కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుకు చేపట్టిన నిర్ణయం సమయోచితం మాత్రమే కాదు, దూరదృష్టి కలిగిన వ్యూహాత్మక చర్య. బొగ్గు నుంచి గ్యాస్ ఉత్పత్తి చేసే ఈ సాంకేతికత ద్వారా దేశం దీర్ఘకాలికంగా విదేశీ ఆధారాలను తగ్గించుకోవడం సాధ్యమవుతుంది.ఖతార్, దుబాయ్ వంటి దేశాలపై ఎల్‌ఎన్‌జీ కోసం అత్యధికంగా ఆధారపడటం భారత్ శక్తి భద్రతకు పెద్ద ముప్పు. భౌగోళిక రాజకీయ సంక్షోభాలు ఎప్పుడు ఏ రూపంలో మన సరఫరా గొలుసును దెబ్బతీస్తాయో చెప్పలేం. గతంలో రష్యా?ఉక్రెయిన్ యుద్ధం కూడా ఇంధన ధరలను పెంచి భారత్‌ను ఇబ్బంది పెట్టింది. ఇలాంటి సందర్భాల్లో స్థానిక ఉత్పాదకతను పెంచకపోతే,




ఆర్థిక వ్యవస్థ మీద ఒత్తిడి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో మోదీ సర్కారు చేపట్టిన కోల్ గ్యాసిఫికేషన్ కార్యక్రమం భారత్ చరిత్రలో మొదటి సారి ఇంత పెద్ద స్థాయిలో చేపట్టిన ప్రయత్నం. దేశంలో సమృద్ధిగా ఉన్న బొగ్గు వనరులను సమర్థవంతంగా వినియోగించుకుని, సింథటిక్ గ్యాస్ ఉత్పత్తి చేయడం ద్వారా దిగుమతులు తగ్గించి, విదేశీ మారక నిల్వలను కాపాడవచ్చు.ఈ ప్రాజెక్టు విజయవంతమైతే ఖతార్‌పై మాత్రమే కాక, మొత్తం ఇంధన దిగుమతులపై ఆధారం తగ్గుతుంది. ఉపాధి అవకాశాలు పెరగడం, బొగ్గు ఉత్పత్తి ప్రాంతాల అభివృద్ధి, శక్తి భద్రత వంటి బహుముఖ ప్రయోజనాలు ఉన్నాయి. అంతేకాకుండా, ఇది ప్రపంచానికి ఒక మార్గదర్శకంగా నిలవవచ్చు. ఖతార్ వంటి దేశాలపై ఆధారపడిన అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా ఇలాంటి మార్గాలు అన్వేషించేలా చేస్తుంది. అయితే, ఈ ప్రయత్నం సవాళ్లు లేకుండా కాదు. పర్యావరణ భద్రత, కార్బన్ ఉద్గారాల నియంత్రణ, ఆధునిక టెక్నాలజీ అవసరం ఉంది. కార్బన్ క్యాప్చర్ అండ్ స్టోరేజ్ (సీసీఎస్) వంటి సాంకేతికతలను తప్పనిసరిగా అనుసరించాలి. ప్రారంభ దశలో ఖర్చులు ఎక్కువైనా, దీర్ఘకాలిక లాభాలు భారీగా ఉంటాయి.ఇంధన రంగంలో స్వాతంత్ర్యం సాధించడం ఏ దేశానికైనా జాతీయ భద్రతకు సమానం. ఖతార్ సంక్షోభం భారత్‌కు ఒక కఠిన హెచ్చరికగా మారి, స్వయం సమృద్ధి వైపు వేగంగా అడుగులు వేయడానికి కారణమైంది. మోదీ సర్కారు చేపట్టిన కోల్ గ్యాసిఫికేషన్ కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేస్తే, ఇది కేవలం ఒక ప్రాజెక్టు కాకుండా, భారత్ ఇంధన విధానంలోనే ఒక చారిత్రక మలుపుగా నిలుస్తుంది. ఈ దిశలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయం. సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణ రక్షణ, సమర్థవంతమైన అమలుతో ఈ ప్రయత్నం పూర్తి విజయం సాధించాలని ఆశిద్దాం.

# పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంపు

## రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ..

## రైతులు వరి కొయ్యలను కాల్చకండి..

**అగ్నిధారన్యూస్ సుల్తానాబాద్**

సుల్తానాబాద్ సింగిల్ విండో ఆధ్వర్యంలో సోమవారం రోజున ప్రభుత్వం రైతులకు 50 శాతం రాయితీపై జానుము, జీలుగ విత్తనాలను స్థానిక నాయకులతో కలిసితెలంగాణ ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు రైతులకు పంపిణీ చేశారు. అనంతరం సింగిల్ విండో చైర్మన్, అధికారులు ప్రభుత్వ విప్ కు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ..పంట భూముల సారాన్ని పెంచేందుకు సేంద్రియ ఎరువుల వినియోగమే మేలు అని, ఇందుకోసమే తమ ప్రభుత్వం రైతులకు జీలుగ విత్తనాలను 50శాతం రాయితీపై అందిస్తోందని అలాగే విత్తనాలు నాటి ఏపుగా పెరిగిన పైరును భూమిలో కలియదు దున్నితే భూసారంపెరుగుతుందన్నారు.రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని కోరారు. సేంద్రియ ఎరువుల వాడకంతో పెట్టుబడి తగ్గి దిగుబడి ఎక్కువగా రావడం వల్ల రైతులు ఎక్కువ లాభాలు పొంద వచ్చని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటించి సాగులో యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్దపల్లి రైతుల ధాన్యంలో కోతలు పెట్టి నట్టేటముంచిన వారే ఈరోజు నీతులు పలుకుతున్నారని విమర్శించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వారి ధాన్యం కొనుగోలు క్వింటలకు 10 నుండి 15 కిలోల వరకు కోతలు విధించి వారి నడ్డి విరిచిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వనీదేనని అన్నారు.ప్రజాప్రభుత్వంలో



రైతులు పండించిన ధాన్యం కొనుగోలు విషయంలో కటింగ్ లేకుండా అన్నదాతలకు అండగా ఉంటున్నాము అని అన్నారు. తడిసిన రంగు మారిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని అన్నారు. రైతులు ఎవ్వరూ వరి కొయ్యలను కాల్చకూడదని కోరారు. వరి కొయ్యలను కాల్చడం ద్వారా భూసారం తగ్గిపోతుందని మరియు అగ్ని ప్రమాదాలకు గురవ్వడం జరుగుతుందని ఈ పద్ధతి మానుకోవాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్, మున్సిపల్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్ మరియు డైరెక్టర్లు మరియు కౌన్సిలర్లు మరియు వ్యవసాయ శాఖ అధికారులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి మేయర్ మహంకాళి స్వామి సూచనలు**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):**

వడదెబ్బ బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని రామగుండం మేయర్ మహంకాళి స్వామి సూచించారు. ఎండల తీవ్రత పెరిగి ప్రజలు వడదెబ్బ బారిన పడుతున్న నేపథ్యంలో సోమవారం ఆయన ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు.

ఈ సందర్భంగా వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడిన మేయర్ అనంతరం వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో వైద్యులు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటున్నారని, విభాగాధిపతులు విధుల్లో కనిపించడం లేదని రోగులు ఫిర్యాదు చేశారు. అలాగే నీటిని శుద్ధి చేసే యంత్రాలు, ఫ్యాన్లు, కూలర్లు పనిచేయడం లేదని, ఐసీయూ, అత్యవసర వార్డుల్లో ఏసీలు సరిగా పనిచేయక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వైద్యులు ఆసుపత్రికి కొత్తగా 10 కూలర్లు, 20 ఫ్యాన్లు అవసరమని, వడదెబ్బ ప్రభావాన్ని తగ్గించేందుకు స్ప్రింక్లర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. ఎంఆర్ఐ స్కానింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని, కొన్ని రకాల మందులు ప్రభుత్వ సరఫరాలో లేకపోవడంతో రోగులు బయట కొనుగోలు చేయాల్సి వస్తోందని వెల్లడించారు. దీనిపై స్పందించిన మేయర్, ఆసుపత్రి అవసరాలను లిఖితపూర్వకంగా అందిస్తే ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్



కార్పొరేషన్ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. అత్యవసర విభాగాల్లో టవర్ ఏసీలు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఆసుపత్రిలో అన్ని వేళలా వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. తన సందర్శనలో పలువురు వైద్యులు గైర్హాజరైన విషయం గమనించానని, ఇది పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఫోన్ కాల్స్‌కు వైద్యులు స్పందించాలని, ప్రైవేట్ ప్రాక్టీస్ కంటే ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. వడదెబ్బ నివారణకు ఉపయోగపడే ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఆసుపత్రితో పాటు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని, ప్రత్యేక ఏసీ గదులు, అంబులెన్స్ సేవలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వార్డుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముస్తాఫా, ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ రాజు, వైద్యులు అశోక్, అజయ్, స్వప్నలత తదితరులు పాల్గొన్నారు.

# గంగా-జమునా తెహజీబ్‌ను కాపాడుకుందాం

**బక్రీద్‌ను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి**
**పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి పిలుపు**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**

త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను పరస్పర సహకారంతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టిందని తెలిపారు. రామగుండం పోలీస్ స్టేషన్‌లో సీఐ కృష్ణ ఆధ్వర్యంలో, ఎస్సై సంధ్యారాణి సమన్వయంతో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలతో శాంతి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ జిల్లాలో గంగా-జమునా తెహజీబ్ (మత సామరస్యం) ఎప్పటి నుంచో కొనసాగుతోందని, అన్ని మతాల ప్రజలు కలిసి మెలిసి జీవించడం సంతోషకరమని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ వినియోగం అధికమవడంతో కుటుంబ బంధాలు దూరమవుతున్నాయని, యువత సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నిజానిజాలు తెలుసుకోకుండా ఫార్వర్డ్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బక్రీద్ పండుగ శాంతి, సహనం, పరస్పర గౌరవానికి ప్రతీక అని పేర్కొన్న ఆయన, జిల్లాలో అన్ని పండుగలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవడం ఆనందకరమని తెలిపారు. రోజుకు



కనీసం పది నిమిషాలైనా కుటుంబ సభ్యులతో గడపాలని, సెల్‌ఫోన్ల కారణంగా ఒకరికొకరు దూరం కాకూడదని సూచించారు.అనుమానాస్పద వాహనాలు, అక్రమ రవాణా గమనిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పండుగ నేపథ్యంలో ఎలాంటి వదంతులు, అపోహలు వ్యాప్తి చెందకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని, వాటిని ఇతరులకు షేర్ చేయవద్దని సూచించారు.

ప్రభుత్వం అనుమతించిన నిర్ణీత ప్రదేశాల్లోనే ఖుర్బానీ నిర్వహించాలని, జంతు అవశేషాలను బహిరంగ ప్రదేశాల్లో పారవేయకుండా పరిశుభ్రత పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏవైనా అనుమానాస్పద సంఘటనలు కనిపిస్తే వెంటనే డయల్-100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, రామగుండం సీఐ కృష్ణ, ఎస్సై సంధ్యారాణి, వివిధ మతాల పెద్దలు పాల్గొన్నారు.

## 100 రోజుల్లో అభివృద్ధి చేస్తామన్న హామీలు ఏమయ్యాయి?



**ప్రజా ప్రతినిధులపై నగునూరి రాజు విమర్శలు**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**

కార్పొరేషన్ ఎన్నికల సమయంలో 100 రోజుల్లో డివిజన్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రజా ప్రతినిధులు ఇప్పటి వరకు వాటిని అమలు చేయలేదని 49వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి నగునూరి రాజు విమర్శించారు. ఎన్నికల సమయంలో తనకు ఓటేస్తే అభివృద్ధి జరగదని ప్రజలను భయపెట్టి ఓట్లు వేయించుకొని ఇప్పుడు డివిజన్ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. డివిజన్‌లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇందిరమ్మ ఇండ్లు, సీసీ కెమెరాలు, కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 100 రోజులు గడిచినా ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. గతంలో ఉమ్మడి 25వ డివిజన్‌గా ఉన్న సమయంలోనే టీయూఎఫ్ఐడీసీ కింద రూ.7 కోట్ల అభివృద్ధి పనులకు డీపీఆర్‌లు సిద్ధం చేసినట్లు తెలిపారు. అయితే అప్పట్లో అధికార పార్టీకి చెందిన వ్యక్తులు అభివృద్ధికి అడ్డుపడ్డారని విమర్శించారు.

గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలో, మున్సిపల్ శాఖ ద్వారా రామగుండం కార్పొరేషన్‌కు టీయూఎఫ్ఐడీసీ కింద రూ.100 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి అంతా ఆ నిధులతోనే జరిగిందని, ప్రస్తుత ప్రజాప్రతినిధులు కొత్తగా చేసినది ఏమీ లేదని విమర్శించారు. నగునూరి రాజుకు ఓటు వేస్తే అభివృద్ధి చేయమని ప్రజలను తప్పుదోవ పట్టించారని, ఇప్పటికైనా ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మరో 100 రోజుల గడువు ఇస్తున్నామని, అయినా పనులు పూర్తి చేయకపోతే ప్రజలతో కలిసి ఉద్యమాలు చేపట్టి అధికారులను నిలదీస్తామని హెచ్చరించారు.

## మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ



**ఉదయ్‌నగర్‌లో కార్యక్రమంలో పాల్గొన్న మనాలి ఠాకూర్**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**

రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఆయన సతీమణి మనాలి ఠాకూర్ ఉదయ్‌నగర్‌లో నిర్వహించిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయ్ స్లమ్ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలకు ఆమె చేతుల మీదుగా బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం, ఆర్థిక మరియు సామాజిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. మహిళలు స్వయం సమృద్ధిగా ఎదిగి సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. సమాజ సేవా కార్యక్రమాల్లో మహిళలు ముందుండి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## మల్లమ్మ మృతికి కమిషనర్ బాధ్యత వహించాలి

**కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి**
**ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఏ. గౌస్ డిమాండ్**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికురాలు మల్లమ్మ మృతికి కమిషనర్ అరుణ శ్రీ బాధ్యత వహించాలని, ప్రభుత్వం ఆమెపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఏ. గౌస్ డిమాండ్ చేశారు. మల్లమ్మ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆర్థిక భరోసా ఇవ్వాలని కోరారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన మెరుపు సమ్మె సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగి 50 డిగ్రీలకు చేరుతున్నా కార్మికుల పని వేళలను మార్చడంలో నగర పాలక సంస్థ విఫలమైందని ఆరోపించారు. కార్మికులకు కనీసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు, తలపాగాలు కూడా సరఫరా చేయడం లేదని విమర్శించారు. కార్మికురాలు మల్లమ్మ విధులకు హాజరైన అనంతరం సాయంత్రం వరకు ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు మున్సిపల్ కార్యాలయానికి సమాచారం ఇచ్చినా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. రెండు రోజుల తర్వాత ఆమె మృతదేహం కనిపించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. తీవ్రమైన ఎండలో పని చేయడం వల్ల వడదెబ్బకు గురై మల్లమ్మ మృతి చెందినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్‌ల నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని ఆరోపించిన గౌస్, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అదేవిధంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల పని వేళలను మార్చి వేసవి తీవ్రత నుంచి ఉపశమనం కల్పించాలని ఆయన కోరారు.

## ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన సదస్సు.

**రుద్రవరం :** మండల వ్యవసాయ అధికారి జి సుమతి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం మండలంలోనికోటకొండ గ్రామంలొ ఖరీఫ్ సీజన్ లో ఎల్ నీనో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉన్నందువలన రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని డాక్టర్ సహదేవరెడ్డి ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఆర్ ఏ ఆర్ ఎస్ మార్టేరు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్ వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ ఈ సీజన్ లో వర్షాలు

# కమిషనర్‌ను తొలగించి కార్మికులకు న్యాయం చేయాలి

**మల్లమ్మ మృతికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్**
**మెరుపు సమ్మెతో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా**

అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీను విధుల నుంచి తొలగించి, వడదెబ్బతో మృతి చెందిన పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మికురాలు గాజనవేణ మల్లమ్మ కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని మున్సిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం 4 గంటల నుంచి 9.30 గంటల వరకు కార్మికులు విధులను బహిష్కరించి మెరుపు సమ్మె నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు వేల్పుల కుమారస్వామి, నడిపెల్లి మురళీధర్ రావు, ఎం.ఏ. గౌస్, సమ్మెకు మద్దతు తెలిపిన మార్క్సాపురి సూర్య మాట్లాడుతూ ఈ నెల 21న విధులు నిర్వహిస్తున్న సమయంలో వడదెబ్బకు గురై గాజనవేణ మల్లమ్మ మృతి చెందిందని తెలిపారు. ఈ ఘటనకు కమిషనర్ అరుణశ్రీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

కమిషనర్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కార్మికులను కట్టుబానిసల్లా చూస్తూ అధిక పనిభారం మోపుతున్నారని, మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 11 గంటలకే కార్మికులను ఇండ్లకు పంపాల్సి ఉండగా సమయపాలన లేకుండా పనులు చేయిస్తున్నారని విమర్శించారు. ఇటీవల ముగ్గురు కార్మికులు ఎండదెబ్బతో ఆసుపత్రిపాలయ్యారని, మరో ముగ్గురు కార్మికులు మృతి చెందారని పేర్కొన్నారు. ఇప్పుడు మల్లమ్మ




మృతి కార్మికుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. మంచినీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించకుండా పని ఒత్తిడి పెంచుతున్నారని ఆరోపించారు. నిర్దేశించిన పనులు పూర్తి చేయకపోతే మాస్టర్ వేయమని, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. చీపుర్లు, చెప్పులు, మాస్కులు, సబ్బులు, కొబ్బరి నూనె, తట్టలు, పారలు, బ్లౌజులు వంటి కనీస అవసరమైన వస్తువులు కూడా ఇవ్వకుండా పనులు చేయిస్తున్నారని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు కమిషనర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని ఆరోపించారు. మల్లమ్మ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుని, రూ.20 లక్షల నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ వచ్చి సాయంత్రం 4 గంటలకు చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం. రామాచారి, కిషన్ నాయక్, గుంజ రమణ, రామలక్ష్మి, రేణికుంట్ల సారయ్య, పాముకుంట్ల సునీత తదితరులతో పాటు సుమారు 400 మంది కార్మికులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత



**సర్పంచ్ హేమ బాలమ్మ**

అగ్నిధార న్యూస్ సిద్దిపేట

జిల్లా జగదేవపూర్ : సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరం అని అంతయ గూడెం గ్రామ సర్పంచ్ హేమ బాలమ్మ సురేష్ అన్నారు.మండలం లోని అంతయ గూడెం గ్రామానికి చెందిన గాడిచర్ల సత్తమ్మ కొన్ని రోజుల క్రితం అనారోగ్యం కారణంగా హాస్పిటల్ లో చేరారు, హాస్పిటల్ అధికంగా డబ్బులు ఖర్చు కాగా స్థానిక గ్రామ సర్పంచ్ హేమ బాలమ్మ సురేష్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి,గజ్వేల్ మార్కెట్ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి,మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి కీ అప్లై చేయగా వారికి సీఎం సహాయనిధి నుండి మంజూరైన రూ.60,000/- రూపాయల చెక్కును బాధితురాలికి అందజేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బందరం మహేందర్, గాడిచార్ల రాజు మంద కిషన్ పిట్ల కనకయ్య గాడిచార్ల నవీన్ మోలుగు కిష్టయ్య , తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం



**కొండపోచమ్మ మాజీ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి**

అగ్నిధార న్యూస్ సిద్దిపేట

జిల్లా గజ్వేల్ నియోజకవర్గం సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం అని కొండపోచమ్మ మాజీ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి అన్నారు. జగదేవపూర్ మండలం దౌలాపూర్ గ్రామానికి చెందిన ముక్కెర బాలకృష్ణ వల్ల మామ ముద్దాపూర్ గ్రామశీ వారు వారి కుటుంబానికి చెందినారు. హాస్పిటల్ లో అనారోగ్యంతో చేరగా హాస్పిటల్ అధిక ఖర్చులు నిమిత్తము కొండపోచమ్మ మాజీ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి గారికి తెలపగా సీఎం సహాయ నిధికి ధరఖాస్తూ చేయాగ ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి మాజీ యఫ్ డీసీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి తెలపగ వారు వెంటనే స్పందించి సీఎం సహాయ నిధి నుండి మంజూరు చేయించారు. మంజూరైన రూ. 16,500 రూపాయలని, లబ్ధిదారునికి మంజూరైన రూపాయలు కొండపోచమ్మ మాజీ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. వారితో పాటుగా మాజీ ఉప సర్పంచ్ జూపల్లి భాస్కర్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ విప్ ను కలిసిన ఆర్డీవో ఆఫీస్ ఏవో



అగ్నిధారన్యూస్ పెద్దపల్లి

సోమవారం పెద్దపల్లి రెవెన్యూ డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్,(తహసీల్దార్ ) పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తూము రవీందర్ పటేల్ జిల్లా గెజిటెడ్ అధికారుల అధ్యక్షులు, మొదటిసారి పెద్దపల్లి శాసన సభ్యులు ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావుని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు విజయ రమణారావు మాట్లాడుతూ... పెద్దపల్లి డివిజన్ లోని అన్ని మండలంలో గల రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చెయ్యాలని, అందరు అధికారులతో ప్రజలతో సమన్వయం చేసుకొని డివిజన్ కు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు తూము రవీందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గీత కార్మికునికి తీవ్ర గాయాలు



అగ్నిధారన్యూస్ పెద్దపల్లి

పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన కొయ్యడ శ్రీనివాస్ గౌడ్(53) సోమవారం సాయంత్రం 5 గంటల సమయం లో వృత్తి రిత్య తాడి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవ శత్తు చెట్టు పై నుండి క్రింద పడి తీవ్ర గాయల పాలయ్యాడు. గుర్తించిన సమీప గీత కార్మికులు వెంటనే శ్రీనివాస్ గౌడ్ ను పెద్దపల్లి లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించ చికిత్స పొందుతున్నాడు. ప్రభుత్వం ఎక్స్ గ్రేసియా అందించి శ్రీనివాస్ గౌడ్ కుటుంబాన్ని ఆదుకోవాలని గౌడసంఘం అధ్యక్ష ఉపాధ్యక్షులు కొయ్యడ ఆశల సతీష్ గౌడ్, న్యాలం సంపత్ గౌడ్ లు ప్రభుత్వాన్ని కోరారు .

## రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోయిన వారికి టీ డీ ఆర్ ద్వారా న్యాయం చేయాలి



**బి ఆర్ యస్ సీనియర్ నాయకుడు సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ సి సంతోష్**

అగ్నిధార న్యూస్ సిద్దిపేట

జిల్లా గజ్వేల్ లో సోమవారం బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ సి సంతోష్ మాట్లాడుతూ గజ్వేల్ ప్రాంతాన్ని( హెచ్ఎండిఏ) లిమిట్స్‌లో చేర్చడం వల్ల ఇక్కడ రోడ్డు విస్తరణలో స్థలాలు, ఇళ్లు కోల్పోయిన బాధితులందరికీ ఇదొక మంచి అవకాశం. గతంలో (టిడిఆర్) సర్టిఫికెట్లు కేవలం కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాలకే పరిమితం కావడం వల్ల, అప్పట్లో మనం ఈ సర్టిఫికెట్లు ఇవ్వలేకపోయాము. కానీ ఇప్పుడు బాధితులకు మార్కెట్ వాల్యూ కంటే 400 శాతం (నాలుగు రెట్లు) లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవడం జరిగింది. ?కాబట్టి బాధితులందరూ కూడా తమ ల్యాండ్ పేపర్స్ మరియు ఎంత రోడ్డు ఎఫెక్ట్ అయిందో ఆ వివరాలన్నీ సిద్ధం చేసుకొని, లోకల్ మున్సిపాలిటీలోని( టిపిఎస్) సెక్షన్‌ను సంప్రదించాల్సిందిగా కోరుతున్నాను. మున్సిపల్ అధికారులు, పాలకవర్గంతో మాట్లాడి దీనిపై ప్రజలకు మరింత అవగాహన కల్పించి, బాధితులందరికీ న్యాయం జరిగేలా మేము ఖచ్చితంగా కృషి చేస్తాము.అని అన్నారు

## మేర కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు



**రాష్ట్ర మేర కార్పొరేషన్ చైర్మన్ సంఘు వెంకట రాజ్యం**

అగ్నిధార న్యూస్,(హైదరాబాద్):

తెలంగాణ రాష్ట్రంలో మేర కులస్తులను గుర్తించి మేర కార్పొరేషన్ ఏర్పాటు చేసి, చైర్మన్, వైస్ చైర్మన్‌లను నియమించినందుకు ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి కు రాష్ట్ర మేర కార్పొరేషన్ చైర్మన్ సంఘు వెంకట రాజ్యం కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి రాష్ట్రంలోని మేర కులస్తుల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మేర కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు రూ.50 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నూతనంగా నియమితులైన కార్పొరేషన్ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరేలా కృషి చేయాలని సూచించారు. సమాజ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని పేర్కొన్నారు. అలాగే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి ప్రతి కార్పొరేషన్ చైర్మన్, వైస్ చైర్మన్ కృషి చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చినట్లు సంఘు వెంకట రాజ్యం తెలిపారు.

## సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రూ.10 వేల కనీస పెన్షన్ ఇవ్వాలి

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నూనె రాజేశం విజ్ఞప్తి**

అగ్నిధార న్యూస్,(రామగుండం):

ప్రాణాలను సైతం లెక్కచేయకుండా భూగర్భ గనుల్లో రాత్రింబవళ్లు శ్రమించి దేశానికి వెలుగులు పంచిన సింగరేణి కార్మికులకు నెలకు కేవలం రూ.1000 పెన్షన్ ఇవ్వడం సిగ్గుచేటని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నూనె రాజేశం అన్నారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తి ద్వారా పరిశ్రమలకు శక్తిని అందించి దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సింగరేణి కార్మికుల సేవలను ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఆసరా పెన్షన్ లబ్ధిదారులకు రూ.2000, వికలాంగులకు రూ.4000, అర్చకులకు రూ.10 వేల వేతనం ఇస్తున్న ప్రభుత్వం.. సింగరేణి రిటైర్డ్ కార్మికులకు మాత్రం కేవలం రూ.1000 పెన్షన్ ఇవ్వడం అన్యాయమని విమర్శించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలకు లక్షల్లో జీతాలు చెల్లిస్తున్న ప్రభుత్వం.. జీవితాంతం ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేసిన కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ప్రస్తుతం ఉన్న ధరల పరిస్థితుల్లో రూ.1000తో రిటైర్డ్ కార్మికుడు జీవనం సాగించడం అసాధ్యమని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల కష్టాన్ని గుర్తించి కనీస పెన్షన్‌ను రూ.10 వేల వరకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంపీ వంశీకృష్ణ పార్లమెంట్‌లో ప్రతిపాదించిన కనీస పెన్షన్ అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా పరిశీలించి మానవత్వం చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూనె రాజేశం కవి, రచయిత, సోషల్ వర్కర్, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి (మంథని నియోజకవర్గం)గా తన అభిప్రాయాలను వెల్లడించారు.

## సెలవుల రద్దుపై సమత సైనిక్ దళ్ ఆగ్రహం

**ఉద్యోగులను బానిసల్లా చూడొద్దు**
**డాక్టర్ మార్షల్ దుర్గం**
**జల్ శక్తి అభియాన్ పేరుతో వేధింపులు ఆపాలని డిమాండ్**

అగ్ని ధార న్యూస్,(రామగుండం):

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 'జల్ శక్తి అభియాన్' కార్యక్రమం పేరుతో ఉద్యోగుల సెలవులను రద్దు చేస్తూ అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌పై సమత సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్షల్ దుర్గం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మండుతున్న ఎండల్లో సిబ్బందిని ప్రతిరోజూ 100 ఇళ్లను సందర్శించాలని ఆదేశించడం పూర్తిగా అమానవీయ చర్య అని విమర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు ఉద్యోగులు ఎప్పుడూ సహకరిస్తారని, అయితే వారిని యంత్రాల్లా పనిచేయించాలని ఒత్తిడి తేవడం సరికాదన్నారు.పండుగలు, సెలవులు లేకుండా సిబ్బందిపై అదనపు భారం మోపడం వల్ల కుటుంబ జీవితం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించాలని కోరిన ఆయన, రద్దు చేసిన సెలవులను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఒకేసారి 100 ఇళ్లను సందర్శించాలనే నిబంధనను సడలించి, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించాలని సూచించారు.ఉద్యోగుల హక్కులను కాలరాసే విధంగా ఉన్న ఈ సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే సమత సైనిక్ దళ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని డాక్టర్ మార్షల్ దుర్గం హెచ్చరించారు.అధికారులు తక్షణమే స్పందించి సిబ్బంది పట్ల సానుకూల వైఖరి అవలంబించాలని ఆయన కోరారు.

## నేతకాని సమస్యల పరిష్కారానికి వినతిపత్రం

అగ్ని ధార న్యూస్,
(ములుగు):



నేతకాని కులస్తుల సమస్యల పరిష్కారం, కేంద్ర గెజిట్‌లో సవరణలు, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు తదితర డిమాండ్లతో ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఏజెన్సీ నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి ఈశ్వర్ నేతకాని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న నేతకాని కులస్తులకు ఏజెన్సీ చట్టాలు పూర్తిగా వర్తింపజేయాలని, కేంద్ర గెజిట్‌లో తప్పుగా నమోదైన "నేతాని, నెట్కాని" పేర్లను సవరించి "నేతకాని"గా నమోదు చేయాలని కోరారు. అలాగే మాలసాలె కులానికి భిన్నంగా నేతకాని కులానికి ప్రత్యేక గెజిట్ నెంబర్ కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వెనుకబడిన నేతకాని కులస్తుల అభివృద్ధి కోసం రూ.1000 కోట్ల నిధులతో ప్రత్యేక అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేయాలని, హైదరాబాద్‌లో నేతకాని సంక్షేమ భవనం నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఈ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కేంద్ర న్యాయశాఖ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా త్వరలో వినతిపత్రాలు పంపనున్నట్లు పేర్కొన్నారు.

# రైతు వెంటే బీజేపీ... చివరి గింజ కొనేవరకు పోరాటం

**వరంగల్‌లో రేవంత్ చెప్పిన రైతు న్యాయం ఎక్కడ..?**
**గజ్వేల్ ఎమ్మెల్యే, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ రైతులకు బేడీలు వేసిన చరిత్ర ఆయనది**
**బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు**



**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా :**

గజ్వేల్ ఎమ్మెల్యే, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ రైతులకు బేడీలు వేసిన చరిత్ర కలిగిన వ్యక్తి అని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు తీవ్ర విమర్శలు చేశారు. "ఇద్దరూ రైతు ద్రోహులే" అంటూ మండిపడ్డారు. బీజేపీ రైతు భరోసా యాత్రలో భాగంగా గజ్వేల్ మార్కెట్‌కు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రైతులతో మమేకమై వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి సహకారం అందడం లేదని, ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు బీజేపీ నాయకులకు వివరించారు. రైతులకు "మేమున్నాం" అనే భరోసాను బీజేపీ నేతలు కల్పించారు. బీజేపీ నేతలు వస్తున్నారనే సమాచారం తెలిసిన వెంటనే అధికారులు హుటాహుటిన ధాన్యాన్ని తరలించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. "ఇన్ని రోజులు ప్రభుత్వం నిద్రపోయిందా..? నెల రోజులుగా రైతులు కన్నీరు మున్నీరవుతుంటే పాలకులు ఏమి చేస్తున్నారు..?" అని ప్రశ్నించారు. రోడ్లపై ధాన్యం తడుస్తూ ఉండగా, వడ్లు మొలకెత్తుతున్నా కొనుగోలు కేంద్రాలు స్పందించడం లేదని విమర్శించారు. పొద్దుతిరుగుడు పంట కూడా నెల రోజులుగా కొనుగోలు కాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్న ప్రభుత్వ ప్రకటనలు పూర్తిగా అబద్ధం. ఇప్పటికీ రింగ్ రోడ్ చుట్టూ, గ్రామాల్లో ఎక్కడ చూసినా ధాన్యం రాశులే కనిపిస్తున్నాయి" అని పేర్కొన్నారు. రైతుకు న్యాయం జరిగే వరకు బీజేపీ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు రైతులకు అండగా నిలిచి ఉద్యమం చేస్తారని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభించకపోతే ఉద్యమం మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్ రెడ్డి, రామారావు పటేల్, హరీష్, బీజేపీ అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ రావు, ఎల్లో రాంరెడ్డి, కుడికెల రాములు, బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాలుగో వార్డ్ కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, గజ్వేల్ పట్టణ అధ్యక్షులు మనోహర్ యాదవ్, రొట్టెల రాందాస్, అశోక్, ఐలయ్య, తిరుపతిరెడ్డి, సంపత్ రెడ్డి, రామ్ రెడ్డి, సత్యం, లక్ష్మణ్, వెంకట్ గౌడ్, జానకిరామ్, పోచయ్య, వెంకట్ రెడ్డి, సందీప్, వెంకటేష్ శివకుమార్ లతో పాటు జిల్లా, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హెర్నియా క్లిష్టమైన శస్త్ర చికిత్స విజయవంతం



**సూపరింటెండెంట్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి గజ్వేల్ డాక్టర్ అన్నపూర్ణ**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట**

జిల్లా గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి నందు సంగారెడ్డి జిల్లాకు చెందిన చింతలచెరువు గ్రామానికి చెందిన 29 ఏళ్ల అశ్విని అనే యువతి తీవ్రమైన అబ్స్ట్రక్టెడ్ ఇన్సిషనల్ హెర్నియా సమస్యతో అత్యవసర పరిస్థితిలో గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ప్రధాన ఆసుపత్రికి చేరుకున్నారు. పేగులకు రక్తప్రసరణ ఆగిపోవడంతో గ్యాంగ్రీన్ వచ్చే ప్రమాదం ఉన్న నేపథ్యంలో వైద్య సిబ్బంది వెంటనే స్పందించి అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ హెర్నియాతో బాధపడుతున్న క్లిష్ట మైన శస్త్రచికిత్స ద్వారా పేగులు దెబ్బతినకుండా వైద్యులు కాపాడగలిగారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం మెరుగుపడుతూ నిలకడగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డా. ప్రేమ్ జనరల్ సర్జన్ డా. మహిపాల్ అనస్థీషియాలజిస్ట్ కీలక పాత్ర పోషించారు. అలాగే నర్సింగ్ ఆఫీసర్ సునీల్, ఓటీ టెక్నీషియన్స్ చ. వెంకట్, రాజ్‌కుమార్, పేషెంట్ కేర్ సిబ్బంది పి. రాజు, ఎ. స్రా మరియు సపోర్టింగ్ స్టాఫ్ యాదమ్మ సమయానికి స్పందించి సేవలు అందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. అన్నపూర్ణ ఆర్ఎంఓ డా. రాము వైద్య బృందాన్ని అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అత్యవసర క్లిష్ట కేసులకు నాణ్యమైన వైద్యం అందుతున్నదనికి ఈ సంఘటన నిదర్శనంగా నిలిచింది.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక చేయూత

**కాంగ్రెస్ పార్టీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాపనిఖిల్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఊర్కొండ మండల కేంద్రంలో మరణించిన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసిన మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాపనిఖిల్ రెడ్డి ఊరుకొండ మండల కేంద్రానికి చెందిన మౌలానా , మండలంలోని రేవెల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు సుగుణమ్మ అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ మాజీ అధ్యక్షులు ద్యాప నిఖిల్ రెడ్డి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ కాంగ్రెస్ స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పోలె రాజు, పట్టణ అధ్యక్షుడు అరిఫ్, యువజన విభాగం మండల అధ్యక్షుడు గుంజ ఆదినారాయణ మాజీ ఉప సర్పంచ్ కంఠం యాదయ్య, నాయకులు సురేష్, భాస్కర్, షబ్బీర్, తాజోద్దీన్, ఖదీర్, చంద్రశేఖర్, షోయబ్ తదితరులు ఉన్నారు

## మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటా

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జూపల్లి భాస్కర్ రావు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

చారకొండ మండలం జూపల్లి గ్రామంలో కమ్మరి శంకరయ్య నాలుగు రోజుల క్రితం మరణించడం జరిగింది. ఈ విషయం స్థానిక టిఆర్ఎస్ పార్టీ నాయకులు ద్వారా తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వెల్దండ సింగిల్ విండో చైర్మన్, జూపల్లి భాస్కర్ రావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ అన్ని విధాలుగా అండగా ఉంటానని 10,000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జూపల్లి గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా యువజన కాంగ్రెస్ నాయకుని జన్మదిన వేడుకలు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామంలో పాత గ్రామపంచాయతీ ఆవరణలో యువజన కాంగ్రెస్ గ్రామ ప్రధాన కార్యదర్శి మోటాపురం యశ్వంత్ జన్మదిన వేడుకలను యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, వార్డు సభ్యులు , మాజీ వార్డు సభ్యులు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు మరో రూ.20 పెరగనున్నాయా..?

దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇప్పటికే నాలుగుసార్లు పెరిగాయి. ఒక లీటరుపై దాదాపు రూ.7.38 వరకు భారం పడింది. ఈ పెంపు ఇంతటితో ఆగదని సమాచారం. చమురు సంస్థల నష్టాల నేపథ్యంలో ధరలు మరింత పెంచక తప్పదని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ఇండియన్ ఆయిల్ భారత్ పెట్రోలియం హిందుస్థాన్ పెట్రోలియం లాంటి ప్రభుత్వ రంగ సంస్థల నష్టాలు తాజా పెంపుతో పూర్తిగా భర్తీ కాలేదు. అంతర్జాతీయ మార్కెట్ ధరలకు, మన రిటైల్ ధరలకు ఉన్న వ్యత్యాసాన్ని భర్తీ చేయాలంటే లీటరుపై మరో రూ.20 నుంచి రూ.33 వరకు పెంచాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఒక్కసారిగా అంత భారం మోపడం సాధ్యం కాకపోయినా.. విడతల వారీగా ధరల బాదుడు తప్పదని మార్కెట్ నిపుణులు అంటున్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు పాల్పడటంతో ఫిబ్రవరి 28 నుంచి అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు భారీగా పెరిగాయి. కానీ మనదేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికల కారణంగా వరుసగా 74 రోజులపాటు ఇంధన ధరలను పెంచకుండా నిలిపివేశారు. భారత్ తన అవసరాల కోసం 88 శాతం ముడిచమురును దిగుమతి చేసుకుంటుంది. కానీ ధరలను స్థిరంగా ఉంచడంవల్ల మూడు ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలపై ఏకంగా రూ.1.2 లక్షల కోట్లకుపైగా భారం పడింది. ఇప్పుడు ఆ మూడు ఆయిల్ కంపెనీల నష్టాలను పూడ్చేందుకు ధరల పెంపుపై దృష్టిసారించారు. ఇప్పటికే గత పది రోజుల్లో నాలుగుసార్లు పెట్రోల్ ధరలను పెంచారు. అయితే ఇరాన్, అమెరికా మధ్య చర్చలు సఫలమైతే మన చమురు సంస్థలకు ఊరట కలుగుతుంది. అయినా రవాణా ఖర్చులు, పాత నష్టాలవల్ల ధరల భారం వెంటనే తగ్గే అవకాశం లేదు. ఇటు ప్రజలపై ద్రవ్యోల్బణ భారం పడకుండా అటు చమురు సంస్థలు నష్టపోకుండా చూడటం ఇప్పుడు ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది.

## హైదరాబాద్ ఫార్మా కంపెనీ లాభం హైజంప్

ఫార్మాస్యూటికల్స్ రంగ కంపెనీ సాయి పేరెంటరల్స్ గత ఆర్థిక సంవత్సరం(2025--26) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు ప్రకటించింది. క్యూ4 (జనవరి--మార్చి)లో నికర లాభం భారీగా జంప్‌చేసి రూ. 13 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2024--25) ఇదే కాలంలో కేవలం రూ. 1.6 కోట్లు ఆర్జించింది.

## కెసిఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయం.. ఉప్పల వెంకటేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఆమనగల్ అయ్యాసాగర్ లో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు డిజిటల్ ప్రక్రియలో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గంలో గులాబీ శ్రేణుల సమన్వయ సమావేశంలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ యస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ, భవిష్యత్తు కార్యాచరణ మరియు డిజిటల్ సభ్యత్వ నమోదు ప్రక్రియ గురించి అలాగే కెసిఆర్ పథకాలను పల్లె పల్లెనా తీసుకెళ్లి సభ్యత్వంలో వారిని భాగస్వాములను చేయాలనీ గుర్తు చేశారు, పార్టీలో కోవర్టు గా కొంత మంది పనిచేస్తున్నారని వారి ద్వారానే మున్సిపల్ పీఠం చేజారింది అని ఆయన అన్నారు భవిష్యత్తులో మళ్ళీ కెసిఆర్ ముఖ్యమంత్రి అవుతారని ప్రజలకు మళ్ళీ సూపరిపాలన రాబోతుందని గుర్తుచేశారు కల్వకుర్తి లో పార్టీ బలోపేతం కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ,సభ్యత్వ నమోదు ఇంచార్జ్ రజిని సాయి చంద్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, పుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జూపల్లి భాస్కర్ రావు, సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ ,మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్, జిల్లా నాయకులు నాగుల నాయక్ , కౌన్సిలర్లు పాపిశెట్టి రాము , మరియు అన్ని మండలాల అధ్యక్షులు సర్పంచ్ లో మాజీ సర్పంచ్ లు తదితర నాయకులు పాల్గొన్నారు.

## మహిళా వారోత్సవాలలో పోల్గొన్న సర్పంచ్ కృష్ణారెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మండలం లోని మార్చాల గ్రామంలో మహిళా వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, వారం రోజుల పాటు నిర్వహించనున్న మహిళా వారోత్సవాల లో భాగంగా ఈ నెల 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే మహిళా వారోత్సవాలు కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, మహిళల శక్తి, సామర్థ్యాలు, ఆత్మవిశ్వాసం, సాధికారతను ప్రపంచానికి చాటి చెప్పే మహోత్సవమని తెలిపారు. మహిళలు కేవలం లబ్ధిదారులుగా కాకుండా పారిశ్రామిక వేత్తలుగా, ఉపాధి సృష్టికర్తలుగా తీర్చిదిద్దుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో,ఉప సర్పంచ్ నిజాముద్దీన్, వార్డు సభ్యులు వట్టేపు కిషోర్, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మార్చాలలో ముగిసిన వేసవి శిక్షణ శిబిరం




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మండలంలోని మార్చాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన వేసవి శిబిరాలు సోమవారం ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి పాల్గొనడం జరిగింది. గత 15 రోజులుగా విద్యార్థులకు నృత్యం మరియు ఆట పాటలతో పాటు స్పోకెన్ ఇంగ్లీష్, ఎక్స్పెరిమెంట్, క్రాఫ్ట్ , సైన్సు, సింపుల్ మ్యాథమెటిక్స్, వివిధ అంశాలపై నేర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, వేసవికాలంలో పిల్లలు ఎండలో తిరగకుండా శిక్షణ శిబిరాలు నిర్వహించి వారికి ఆటపాటలతో పాటు నృత్యం వివిధ అంశాలపై అవగాహన కల్పించిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిరంజీవి వెంకటరమణ, ఉప సర్పంచ్ నిజాముద్దీన్, వార్డు సభ్యులు వట్టపు కిషోర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు నారాయణ గౌడ్, అనంద్, పాండు, అంగన్వాడి ఉపాధ్యాయులు , డాన్స్ మాస్టర్ రాజు,మరియు మాధురి శివాని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి ని మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పిసిసి అధికార ప్రతినిధి బాలాజీ సింగ్ కలిసి హైదరాబాదులోనీ ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. 32 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్నా అయిల్ల శ్రీనివాస్ గౌడ్ కు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించి సముచితస్థానం కల్పిస్తామని అన్నారు.

## మహిళలు జంక్ ఫుడ్ కు దూరంగా ఉండాలి...

**4వ వార్డు కౌన్సిలర్ ఉమ్లి హనుమనాయక్...**
**జేపీనగర్ అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా మహిళా వారోత్సవాలు...**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

మహిళలు జంక్ ఫుడ్ కు దూరంగా ఉంటూ పోషక పదార్థాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని కల్వకుర్తి మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ ఉమ్లి హనుమనాయక్ సూచించారు. సోమవారం కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు జేపీనగర్ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన మహిళా ఆరోగ్య వారోత్సవాల్లో మున్సిపాలిటీ కౌన్సిలర్ ఉమ్లి హనుమనాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కౌన్సిలర్ ఉమ్లి హనుమనాయక్, అంగన్వాడీ టీచర్ తో కలిసి మహిళలకు ఆరోగ్య పోషణతో పాటు అభివృద్ధి సాధికారత, వంటల పోటీలు గర్భిణి స్త్రీలు బాలింతలకు పోషకాల గురించి ప్రతిజ్ఞలు చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, ఆశవర్కర్ కార్యకర్తలతో పాటు మహిళలు, గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## అధికారం కోసం ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేయాలి

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జూపల్లి భాస్కర్ రావు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఆమనగల్ అయ్యాసాగర్ లో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు డిజిటల్ ప్రక్రియలో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గంలో గులాబీ శ్రేణుల సమన్వయ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు మాట్లాడుతూ, భవిష్యత్తు కార్యాచరణ మరియు డిజిటల్ సభ్యత్వ నమోదు ప్రక్రియ గురించి అలాగే కెసిఆర్ పథకాలను పల్లె పల్లెనా తీసుకెళ్లి సభ్యత్వంలో వారిని భాగస్వాములను చేయాలనీ గుర్తు చేశారు, ఆయన అన్నారు భవిష్యత్తులో మళ్ళీ కెసిఆర్ ముఖ్యమంత్రి అవుతారని ప్రజలకు మళ్ళీ సూపరిపాలన రాబోతుందని గుర్తుచేశారు కల్వకుర్తి లో పార్టీ బలోపేతం కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ,సభ్యత్వ నమోదు ఇంచార్జ్ రజిని సాయి చంద్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, పుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ విజితా రెడ్డి, జిల్లా నాయకులు నాగుల నాయక్ , మండల అధ్యక్షుడు పుట్టరామ్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు జోగయ్య, మరియు అన్ని మండలాల అధ్యక్షులు సర్పంచ్ లో మాజీ సర్పంచ్ లు తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్లు

**పరిశీలించిన స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండల కేంద్రంలో బీసీ హాస్టల్ దగ్గర సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి భారీ వృక్షాలు నేలకొరిగాయని విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అక్కడే ఉండి రోడ్డు మీద పడ్డ భారీ వృక్షాలను తీసివేసి, నేలకు ఒరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటిని సరి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మసిగుడ్ల వెంకటేష్ , మట్ట భరత్ గౌడ్ చిమ్ముల తిరుపతి రెడ్డి, మావిళ్ల రాజు, మట్ట నిరంజన్, విద్యుత్ సిబ్బంది, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు,

## హోంగార్డు నాముండ్ల సుందరయ్యకు సీపీ గౌస్ ఆలం ఘన వీడ్కోలు?

**కరీంనగర్ :** హోంగార్డుగా చేరి, మూడు దశాబ్దాలుగా నిస్వార్థంగా సేవలందించిన నాముండ్ల సుందరయ్య పదవీ విరమణ సందర్భంగా సోమవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు.



# ఈ వారం ఓటీటీల్లో ఎంటర్‌టైన్‌మెంట్ జాతర..

**ధనుష్ 'కర' నుంచి సత్య 'జెట్లీ' వరకు భారీ లైనప్!**

సినిమా ప్రేమికులకు ఈ వారం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు పూర్తి స్థాయి వినోదాన్ని అందించేందుకు సిద్ధమయ్యాయి. యాక్షన్ ఎంటర్‌టైనర్లు, క్రైమ్ థ్రిల్లర్లు, హారర్ కథలు, వెబ్ సిరీస్‌లు, డాక్యుమెంటరీలు ఇలా విభిన్న జానర్లతో ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. మే 25 నుంచి మే 31 వరకు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో స్ట్రీమింగ్ కానున్న సినిమాలు, సిరీస్‌లు మంచి ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

ధనుష్ 'కర'పై భారీ ఆసక్తి

ఈ వారం ప్రేక్షకుల దృష్టిని ఎక్కువగా ఆకర్షిస్తున్న చిత్రం కోలీవుడ్ స్టార్ ధనుష్ నటించిన 'కర'. దర్శకుడు విఘ్నేష్ రాజా తెరకెక్కించిన ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో మమితా బైజు కథానాయికగా నటించారు. థియేటర్లలో మిక్స్‌డ్ టాక్ అందుకున్నప్పటికీ ధనుష్ నటనకు మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా యాక్షన్ ఎపిసోడ్స్, క్లైమాక్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ చిత్రం మే 28 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది.

'లీడర్'తో వస్తున్న శరవణన్

ప్రముఖ వ్యాపారవేత్త, నటుడు లెజెండ్ శరవణన్ నటించిన 'లీడర్' కూడా ఈ వారంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఆర్‌ఎస్ దురై సెంథిల్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పాయల్ రాజ్‌పుత్, ఆండ్రియా, శ్యామ్, లాల్, బాహుబలి ప్రభాకర్ కీలక పాత్రలు పోషించారు. యాక్షన్ ప్రధానంగా రూపొందిన ఈ చిత్రం మే 29 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులోకి రానుంది.

ఓటీటీలోకి వచ్చిన సత్య 'జెట్లీ'

కమెడియన్ సత్య హీరోగా నటించిన తొలి ప్రధాన చిత్రం 'జెట్లీ' ఇప్పటికే ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. దర్శకుడు రితేష్ రానా తెరకెక్కించిన ఈ కామెడీ ఎంటర్‌టైనర్‌లో వెన్నెల కిశోర్, అజయ్, వైవా హర్ష తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. థియేటర్లలో ఆశించిన ఫలితం అందుకోలేకపోయిన ఈ సినిమా ఇప్పుడు జియో హాట్‌స్టార్‌లో కొత్త ప్రేక్షకులను ఆకర్షించేందుకు సిద్ధమైంది.

# స్టార్ హీరోతో ఆగిపోయిన మూవీ.. దెబ్బకు 9 సినిమాల నుంచి అవుట్..



సినీ రంగుల గ్లామర్ ప్రపంచంలో నటిగా ఓ గుర్తింపు తెచ్చుకోవడం అంత సులభమేమి కాదు. ఎన్నో సవాళ్లు.. మరెన్నో అడ్డంకులు దాటుకుని వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న తారలు చాలా మంది ఉన్నారు. అలాగే కెరీర్ మొదట్లోనే ఐరెన్ లెగ్ అనే ట్యాగ్ వచ్చిన హీరోయిన్స్ ఉన్నారు. కానీ ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న ఓ హీరోయిన్ మాత్రం తన తలరాతను మార్చుకుంది. ప్రస్తుతం బాలీవుడ్ ఇండస్ట్రీలో ఆమె స్టార్ హీరోయిన్. తక్కువ సమయంలోనే తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. ఎలాంటి బ్యాగ్రౌండ్ సపోర్ట్ లేకుండానే తనదైన ముద్ర వేసింది. కంటెంట్ ప్రాధాన్యత ఉన్న చిత్రాలను ఎంచుకుంటూ కోట్లాది మంది అభిమానుల హృదయాలు గెలుచుకుంది. అయితే కెరీర్ మొదట్లో ఒక స్టార్ హీరోతో సినిమా ఛాన్స్ వచ్చింది. కానీ అనూహ్యంగా ఆ మూవీ మధ్యలోనే ఆగిపోయింది. కట్ చేస్తే.. రాత్రికి రాత్రే ఆమెను 9 సినిమలా నుంచి తీసేశారంటూ ఆవేదన వ్యక్తం చేసింది.ఆమె మరెవరో కాదు.. హీరోయిన్ విద్యా బాలన్. కొన్ని రోజుల క్రితం ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. తన తొలి సినిమా రోజుల్లో తనను అపశకునం అని.. ఐరెన్ లెగ్ అని పిలిచారని.. అప్పట్లో ప్రతి రాత్రి తాను ఏడుస్తూ నిద్రపోయేదాన్ని అని చెప్పుకొచ్చారు. మలయాళీ స్టార్ హీరో మోహన్ లాల్ సరసన చక్రం అనే సినిమాలో తనకు ఛాన్స్ వచ్చిందని తెలిపింది. ఆ సినిమా కోసం దక్షిణాదిలో ఒక యాడ్ షూట్ జరుగుతున్నప్పుడు, తాను అక్కడికి వెళ్ళగా ఆ సినిమా కోసం ఆడిషన్ ఇవ్వమని తనను అడిగారని అన్నారు. హీరో మోహన్ లాల్ కావడంతో తాను వెంటనే ఒప్పుకున్నానని.. ఆడిషన్ అయిన వెంటనే దర్శకుడు తనను కలవాలనుకోవడంతో, తాను తన సోదరి, తల్లితో కలిసి అక్కడికి వెళ్ళానని విద్యా తెలిపింది. "నేను సినిమా మొదలుపెట్టాను, షూటింగ్ బాగా జరిగింది. 15 రోజుల తర్వాత వాళ్ళు నన్ను బొంబాయికి తిరిగి పంపించేశారు. మేము ఒక సీన్ చేశాము, వాళ్ళు షెడ్యూల్ పూర్తయిందని, మేము మొత్తం సినిమాను ఒకేసారి చిత్రీకరించాల్సి ఉందని చెప్పారు. మోహన్‌లాల్ సార్‌కు కొన్ని డేట్స్ సమస్యలు ఉన్నాయని, అందుకే మేము విరామం తీసుకుని వచ్చే నెలలో తిరిగి వస్తామని చెప్పారు. దర్శకుడికి, మోహన్‌లాల్‌కు సమస్యలు ఉండటంతో మేము చాలా రోజులు షూటింగ్ చేయలేదు. అందుకే ఇలాగే జరగాలేమో అని నేను అనుకున్నాను. అలా నేను సంతోషంగా బొంబాయికి తిరిగి వచ్చాను." "నేను ఒక స్టార్‌ని అని మనసులో అనుకుంటూ ఉండేదాన్ని. కానీ మోహన్‌లాల్ నటించిన 'చక్రం' సినిమా ఆగిపోతుందని నాకు అస్సలు తెలియదు. అది ఆగిపోయిన తర్వాత, నాకు ఆఫర్ చేసిన ఆ 8, 9 సినిమాలన్నీ నేను కోల్పోయాను. ఆ నటుడు, దర్శకుడు కలిసి 8 హిట్లు ఇచ్చారని, ఇప్పుడు వాళ్ళు తమ 9వ సినిమా చేస్తున్నారని అనుకున్నారు. అందుకే, బహుశా ఇది ఈ అమ్మాయి శక్తి వల్లేమో, ఈమెకు ఏదో అపశకునం తగిలిందేమో అన్నారు. అది ఒక పిచ్చి సమయం. చాలా నిరాశ కలిగించిన కాలం. ఈమెకు కనీసం ఒక్క సినిమా అయినా కలిసి రావాలని మా తల్లిదండ్రులు ప్రార్థించడం మొదలుపెట్టారు. నేను ఎదుర్కొంటున్న తిరస్కరణను, నిరాశను వాళ్ళు చూడగలిగారు. ఏడుస్తూ పడుకునేదాన్ని, కానీ ఆశ మాత్రం కోల్పోలేదు." అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె హిందీలో స్టార్ హీరోయిన్ గా దూసుకుపోతుంది.

# నమ్రతా శిరోద్కర్, సితారతో ప్రియాంకా చోప్రా.. ఇంతకీ ఎక్కడ కలిశారో తెలుసా..?



లబాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా ప్రస్తుతం ఎస్ఎస్ రాజమౌళి-మహేశ్ బాబు కాంబోలో రాబోతున్న వారణాసి సినిమాలో నటిస్తుందని తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్స్‌తో బిజీగా ఉంది. కాగా ప్రియాంకా చోప్రా నమ్రతా శిరోద్కర్, సితారతో కలిసి సందడి చేసింది. ఇంతకీ ఈ ముగ్గురూ కలిసింది ఎక్కడో తెలుసా..? సిటీలో ఉన్న వన్ ఆఫ్ ది హైఎండ్ మల్టీప్లెక్స్ ఏఎంబీ సినిమాస్‌లో. ఈ సందర్భంగా నమ్రతా, సితార, ప్రియాంకా చోప్రా కెమెరాకు ఫోజులిచ్చారు. దీనికి సంబంధించిన ఫొటో ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ప్రియాంకా చోప్రా ఆ తర్వాత ఏఎంబీ సినిమాస్ మేనేజ్ మెంట్, స్టాఫ్‌తో కూడా ఫొటోలు దిగింది. ఏఎంబీ సినిమాస్‌లో సందడి చేసిన విజువల్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. వారణాసి చిత్రంలో మందాకిని పాత్రలో కనిపించబోతుంది ప్రియాంకా చోప్రా. శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నవారణాసిలో మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. వారణాసి మూవీ ఫస్ట్ పార్ట్ 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.



# 'రాసి పెట్టుకోండి'.. పెద్దిపై రామ్ చరణ్ గూస్‌బంప్స్ స్పీచ్..!

రామ్ చరణ్ హీరోగా వస్తోన్న రూరల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా పెద్ది. బుచ్చిబాబు డైరెక్షన్‌లో వస్తోన్న ఈ మూవీ.. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. ఇ?ప్పటికే రిలీజైన ట్రైలర్‌కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ప్రస్తుతం ఈ మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే ఈ చిత్రంలోని స్పెషల్ సాంగ్‌ను కూడా విడుదల చేశారు. ఈ మూవ రిలీజ్ తేదీ దగ్గర పడడంతో పెద్ది హీరో రామ్ చరణ్ ప్రమోషన్లతో ఫుల్ బిజీ అయిపోయారు. తాజాగా బెంగళూరులో జరిగిన ఈవెంట్‌కు చెర్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్ది మూవీ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డానని రామ్ చరణ్ అన్నారు. ఈ మూవీ కోసం దాదాపు రెండన్నరేళ్ల పాటు ప్రాణం పెట్టి చేశానని చెర్రీ పంచుకున్నారు. అందరం కూడా కలిసికట్టుగా ఈ మూవీ కోసం శ్రమించామని పేర్కొన్నారు. రాసి పెట్టుకోండి.. ఈ సినిమా నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ అవుతుందని రామ్ చరణ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా.. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా కనిపించనుంది.



# థియేటర్లలో నిరాశపరిచిన 'జెట్ లీ'..

**ఇప్పుడు ఓటీటీలో అదృష్టం పరీక్షించుకోనున్న సత్య సినిమా**

ఈ ఏడాది టాలీవుడ్‌లో వేసవి సీజన్ ఆశించిన స్థాయిలో సందడి చేయలేకపోయింది. పెద్ద సినిమాలతో పాటు కొన్ని చిన్న చిత్రాలు కూడా ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ, వాటిలో చాలా వరకు బాక్సాఫీస్ వద్ద ప్రభావం చూపించడంలో విఫలమయ్యాయి. మంచి అంచనాల మధ్య విడుదలైన కొన్ని చిత్రాలు కూడా ప్రేక్షకులను పూర్తిగా ఆకట్టుకోలేక నిరాశపరిచాయి. అలాంటి సినిమాల్లో ప్రముఖ కమెడియన్ సత్య హీరోగా నటించిన తొలి చిత్రం 'జెట్ లీ' కూడా ఒకటి.తెలుగు సినీ పరిశ్రమలో తన కామెడీ టైమింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సత్య, హీరోగా ఎంట్రీ ఇస్తుండటంతో ఈ సినిమాపై మొదటి నుంచి మంచి ఆసక్తి నెలకొంది. అంతేకాకుండా సత్యకు కెరీర్‌లో కీలక బ్రేక్ ఇచ్చిన దర్శకుడు రితేష్ రానా ఈ చిత్రానికి దర్శకత్వం వహించడంతో అంచనాలు మరింత పెరిగాయి. కానీ విడుదల తర్వాత సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. కథ, కథనం విషయంలో కొత్తదనం ఉంటుందని భావించిన ప్రేక్షకులకు సినిమా పూర్తి స్థాయిలో కనెక్ట్ కాలేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీంతో బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఆశించిన వసూళ్లను రాబట్టలేకపోయింది. హీరోగా సత్య నటనకు ప్రశంసలు వచ్చినప్పటికీ, సినిమా మొత్తం పరంగా ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన లభించింది. ఇప్పుడు ఈ చిత్రం తన అదృష్టాన్ని ఓటీటీ వేదికపై పరీక్షించుకోడానికి సిద్ధమైంది. ప్రముఖ డిజిటల్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ జియో హాట్‌స్టార్ ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకుంది. మొదట ఈ సినిమాను ఒకే భాషలో విడుదల చేస్తారని వార్తలు వచ్చినా, తాజాగా తెలుగు ప్రేక్షకులతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. థియేటర్లలో అంతగా ప్రభావం చూపించలేకపోయిన అనేక సినిమాలు ఓటీటీలో మంచి ఆదరణ పొందిన ఉదాహరణలు గతంలో ఉన్నాయి. దీంతో ఇప్పుడు 'జెట్ లీ'కి కూడా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో కొత్త జీవితం దొరుకుతుందా? ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుందా? అన్న ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి సంగీతాన్ని కాలభైరవ అందించగా, ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. ఇప్పుడు థియేటర్లలో మిస్సైన ప్రేక్షకులు ఓటీటీ ద్వారా ఈ సినిమాను ఎంతవరకు ఆదరిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com